ప్రజాశక్తి
శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 8+8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వినోద్

విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వాలు

- సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర ముగింపులో రాష్ట్ర నేత వినోద్

8లో

తండ్రి చేతిలో హత్యకు గురైన చిన్నారులు (ఫైల్)

బోయలపల్లిలో విషాదఛాయలు

3లో

'డల్లాస్'లో బాపట్ల వాసి మృతి

మెయిన్ 1లో

యువకుడు దారుణహత్య

3లో

యూరియా..ఏదయా.?

- ఎరువుల కోసం రైతుల ఆందోళనలు
- మరో వైపు కొరత లేదంటున్న అధికారులు
- జిల్లాకి వచ్చిన యూరియా ఎటుపోతుందో.?
- సరఫరాలో లోపించిన అధికారుల పర్యవేక్షణ
- అధికారపార్టీ నేతల కనుసన్నల్లోనే పంపిణీ

కర్లపాలెం మండలం, చింతయపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి మొదటి విడతలో రైతులకు ఎంత మేర యూరియా అవసరమో ఆ మేరకు మార్క్‌ఫెడ్, సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులోకి తెచ్చారు. రానున్న రోజుల్లో జిల్లాకు యూరియా మరింతగా రానుందని అంటున్నారు. కానీ గ్రామాల్లో రైతులు మాత్రం తమకు యూరియా దొరకడం లేదని రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఎరువుల సరఫరాలో ప్రధానంగా యూరియా పంపిణీలో లోపించిన అధికారుల పర్యవేక్షణ, గ్రామాల్లో అధికారపార్టీ నేతల కనుసన్నల్లో ఎరువుల పంపిణీ జరుగుతున్న కారణంగా యూరియా కొరత వచ్చిందని తెలుస్తోంది. జిల్లాలో మార్క్‌ఫెడ్, సొసైటీల ద్వారా జరుగుతున్న యూరియా పంపిణీ అధికారం అండగా ఉన్న పెద్ద రైతుల వద్దకు చేరిపోతోంది. ఆర్థిక స్తోమత ఉన్న వారు అధికారాన్ని అడ్డుపెట్టుకొని యూరియాను పొంది భవిష్యత్ అవసరాల కోసం నిల్వ చేసుకుంటున్నారు. గ్రామాల్లో అధికారం అండలేని వారు, చిన్న, సన్నకారు రైతులు యూరియా అందక ఇక్కట్ల పాలవుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 3,24,345 ఎకరాలు కాగా ఇప్పటి వరకు జిల్లాలో వివిధ పంటల సాగు సుమారు 1,80,500 ఎకరాల విస్తీర్ణంలో జరిగింది. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న పంట సాగుకు ప్రస్తుతం యూరియా అవసరం ఉంది. జిల్లాలో రేపల్లె, బాపట్ల వ్యవసాయ డివిజన్ల పరిధిలో విస్తృతంగా వరి సాగు జరుగుతోంది. వర్షాలు కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగు ముమ్మరం చేశారు. సీజన్ ప్రారంభం నుంచే యూరియా కొరత ఉందన్న ప్రచారం వచ్చింది. దీంతో ప్రైవేట్ డీలర్లు వచ్చిన యూరియాను వచ్చినట్లే 2లో

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నేతలు

20న రైతు సంఘం ప్రాంతీయ మహాసభ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలో ఈ నెల 20న ఎపి రైతు సంఘం ప్రాంతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు డి సోమయ్య తెలిపారు. మహాసభకు సంబధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ రైతు సంఘం మహాసభలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వింత ధోరణులతో రైతాంగం కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను సంఘటితం చేసేందుకు రైతు సంఘాలు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులు రైతుల కష్టాన్ని, నష్టాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతు ఆకలి బాధలతో, అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లాలో అత్యంత కరువు ప్రాంతంగా యర్రగొండపాలెం నియోజకవర్గం ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని, వచ్చే వరద సీజన్ నాటికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ తక్షణమే చెల్లించాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు కూడా అవసరమన్నారు. త్వరగా ప్రకటించాలని కోరుతూ పెద్దోర్నాలలో రైతు సంఘం ప్రాంతీయ మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ఆందోళన, పోరాటాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కరపత్రం ఆవిష్కరణలో రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వెన్నా మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గోదా దావీదు తదితరులు పాల్గొన్నారు.

యూరియా..ఏదయా.?

(మొదటిపేజీ తరువాయి)

బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో యూరియా సమస్య తలెత్తినట్లు భావిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగు పంటల అవసరాల కోసం 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని చెబుతున్నారు. మరి ఇప్పటివరకు జిల్లాకి ఎంత యూరియా వచ్చిందనే విషయంలో స్పష్టత లేదు. సరిపడినంత యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం యూరియా 4,748 మెట్రిక్ టన్నులు, డిఎపి 2,986, ఎమ్ఓపి 520, ఎన్‌పికె కాంప్లెక్స్ 6,730, ఎస్ఎస్‌పి 2,210 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయంటున్నారు. ఈ నెలలో జిల్లాకు 6,759 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రభుత్వం నుంచి అంత మేర యూరియా రానుందని 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా, 30 శాతం ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. రైతు సేవాకేంద్రాల వారీగా సాగు విస్తీర్ణం, యూరియా అవసరం, ప్రస్తుత నిల్వల వివరాలను మండల వ్యవసాయ అధికారులు తయారుచేయాలని, ఈ-పంట, భూ రికార్డులు, రైతుల ఆధార్ కార్డు ఆధారంగానే యూరియా పంపిణీ జరపాలని నిర్ధేశించారు. కానీ యూరియా పంపిణీలో పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

కాగా వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను కొందరు వ్యవసాయేతర పనుల కోసం వాడుతున్న కారణంగా కూడా యూరియా అక్రమ మార్గాల్లో వెళుతున్నట్లు తెలుస్తుంది.యూరియాని నాటుసారా, కోళ్ళఫారాలు,మత్స్య ఫారాలు,పశువుల గడ్డి,రంగుల తయారీ వంటి పలు రకాల ఉత్పత్తులలో వినియోగిస్తున్నారు. వాటిపై నిఘా కోసం వివిధ శాఖలతో కమిటీలు వేశారు. వ్యవసాయేతర రంగంలో ఎక్కడైనా యూరియాని వాడుతుంటే నిఘా పెట్టి వీటికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది.అటువంటి చర్యలు కూడా లేవు.

మార్కెట్‌లో యూరియా కొరతను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యూరియా ధర రూ.266.50 కాగా, యూరియా ధర పెంచి రూ.350 నుంచి రూ.400కు విక్రయిస్తున్నారు. ధర పెంపుతో పాటు డీఏపీ, ఇతర ఎరువులు కొనుగోలు చేసిన వారికి మాత్రమే యూరియాను విక్రయిస్తున్నారు. వరి సాగులో సకాలంలో యూరియా వేయకపోతే పంట పెరుగుదలపై ప్రభావం పడుతుంది. రైతులు అధిక ధరపై యూరియా కొనాల్సి వస్తుంది. జిల్లాలో యూరియా కొరత లేదని అధికారులు ఎంతగా చెబుతున్నా క్షేత్రస్థాయిలో సామాన్య రైతులు యూరియా దొరక్క ఇక్కట్ల పాలవుతున్నారు. అధికారులు చెబుతున్న యూరియా లెక్కలకు పొంతన కుదరడం లేదు. యూరియాకు రెక్కలు వచ్చి బ్లాక్ మార్కెట్‌కు, అధికారం అండగా ఉన్న వారి గోదాములకు తరలిపోతోంది. వీటికి జిల్లా అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి కీలక అధికారులు కొందరు గైర్హాజరు కావడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. టీ, బిస్కెట్లకు సమావేశాలు పరిమితమైతే ఎలా అనే చర్చ జరిగింది. ప్రభుత్వ వైద్యశాల నుంచి సూపరింటెండెంట్ లేదా ఆ స్థాయి అధికారి హాజరు కావాల్సి ఉండగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంఎన్ఓ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సలహాలు, సూచనలు, తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించాల్సిన అధికారులు లేకపోవడం ఏమిటని కొందరు గుసగుసలాడారు. పంచాయతీల్లో సమస్యల పరిష్కా రానికి నిధులు అవసరమని, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపిడిఒ ఎం. నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. మొత్తం ఆరు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాకు పరిశీలించారు. ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. మూడు షాపులలో డీలర్లు స్టాక్ నిల్వలను సక్రమంగా నిర్వహించలేదని గుర్తించారు. 35,700 మెట్రిక్ టన్నుల ఎరువుల (రూ.9,84,415) అమ్మకాలు నిలుపుదల చేశారు. ఆయా షాపు యజమానులకు నోటీసులు జారీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోతే వ్యాపారులు నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ అపర్ణ, తహశీల్దారు వివిఎస్.పాల్, మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్, అసిస్టెంట్ జియాలాజిస్ట్ అనిత, కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ శ్రీయుత 8వ అదనపు జిల్లా మరియు ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

EP NO 658/2022
IN
AOP NO 982/2019

Between

శ్రీరామ్ ట్రాన్స్ ఫోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, చీరాల బ్రాంచి,రిప్రజెంటెడ్ బై జి పి ఎ హోల్డర్ వై గోపిచంద్ ...DHR

మరియు

పాలపోగు పవన్ మరియు ఒకరు ...JDRs

To

JDR2) గోరిపాటి శ్యామ్,S/O మోషే, రామాలయం దగ్గర, యద్దనపూడి గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా,

నోటీసు

పై నెంబరు EP ని డి హెచ్ ఆర్ రెండవ జె డి ఆర్ పై బాకీ వసూలు నిమిత్తం పిటిషన్ దాఖలు చేసియున్నారు దరిమిల పై నెంబర్ షెడ్యూలు దాఖలా ఆస్తి వేలం నోటీసులను రెండవ జె డి ఆర్ కు పంపిననూ తీసుకొని కారణం చేత కోర్టు వారు రెండో జె డి ఆర్ కు పేపర్ ప్రకటన ద్వారా వేలం నోటీసు సమన్లను జారీ నిమిత్తం ఉత్తర్వులు జారీ చేసియున్నారు కావున పై తెలిపిన శ్రీయుత కోర్టు వారి ఎదుట వాయిదా తేది 17.09.2025 న మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని ఉదయం గం 10.30. నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియ జేసుకోనవలెయను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కొత్తగొర్ల వెంకటేశ్వర్లు
న్యాయవాది
మురళి ప్లాజా జిల్లా కోర్టు ఎదురు ఒంగోలు

మహారాజశ్రీ పర్చూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E .P.No . **31/2025**
in
O .S .No .**153/2022**

Between:-

తులసి అప్పారావు .... వాది/పిటిషనర్

మరియు

మువ్వల సుబ్రహ్మణ్యం ...ప్రతివాది/రెస్పాండెంట్

To

మువ్వల సుబ్రహ్మణ్యం, తండ్రి లేటు ఆంజనేయులు. డోర్ నెంబర్ 14-107 పర్చూరు గ్రామం మరియు D.M.C.

పై నెంబర్ గల పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినను (U/O 21రూల్22) మీరు నోటీసు ముట్టని కారణం చేత కోర్ట్ వారి ఉత్తరువులు ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది తేదీ **11 .9 .2025** మీరు హాజరు నిమత్తం వాయిదా అయిఉన్నది. కాన మీరు స్వయముగా గాని లేదా మీ తరుపు లాయర్ గారి ద్వారా పై కోర్టు వారి ఎదుట హజరై మీకు గల ఆక్షేపనులు తెలుపుకోగలరు లేని యడల మీ పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేదీ : 11 .9 . 2025

//కోర్టువారి ఉత్తర్వులతో//

తెలనాకుల సురేష్ బాబు
అడ్వకేట్,
పర్చూరు - 523169

మహారాజశ్రీ పర్చూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E .P.No . **29/2025**
in
O .S .No .**151/2022**

Between:-

తులసి రాజ్యలక్ష్మి ...వాది/పిటిషనర్

మరియు

మువ్వల సుబ్రహ్మణ్యం ... ప్రతివాది/రెస్పాండెంట్

To

మువ్వల సుబ్రహ్మణ్యం, తండ్రి లేటు ఆంజనేయులు. డోర్ నెంబర్ 14 -107 పర్చూరు గ్రామం మరియు D.M.C.

పై నెంబర్ గల పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినను (U /O 21 రూల్ 22) మీరు నోటీసు ముట్టని కారణం చేత కోర్ట్ వారి ఉత్తరువులు ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది తేదీ 11 .9 .2025 మీరు హాజరు నిమత్తం వాయిదా అయిఉన్నది. కాన మీరు స్వయముగా గాని లేదా మీ తరుపు లాయర్ గారి ద్వారా పై కోర్టు వారి ఎదుట హజరై మీకు గల ఆక్షేపనులు తెలుపుకోగలరు లేని యడల మీ పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేదీ : 11 .9 . 2025

//కోర్టువారి ఉత్తర్వులతో//

తెలనాకుల సురేష్ బాబు
అడ్వకేట్,
పర్చూరు - 523169

మహారాజశ్రీ పర్చూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E .P.No . **30/2025**
in
O .S .No .**152/2022**

Between:-

తులసి వెంకటేశ్వర రావు .... వాది/పిటిషనర్

మరియు

మువ్వల సుబ్రహ్మణ్యం ...ప్రతివాది/రెస్పాండెంట్

To

మువ్వల సుబ్రహ్మణ్యం, తండ్రి లేటు ఆంజనేయులు. డోర్ నెంబర్ 14-107 పర్చూరు గ్రామం మరియు D.M.C.

పై నెంబర్ గల పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినను (U /O 21 రూల్ 22) మీరు నోటీసు ముట్టని కారణం చేత కోర్ట్ వారి ఉత్తరువులు ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది తేదీ **11 .9 .2025** మీరు హాజరు నిమత్తం వాయిదా అయిఉన్నది. కాన మీరు స్వయముగా గాని లేదా మీ తరుపు లాయర్ గారి ద్వారా పై కోర్టు వారి ఎదుట హజరై మీకు గల ఆక్షేపనులు తెలుపుకోగలరు లేని యడల మీ పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేదీ : 11 .9 . 2025

//కోర్టువారి ఉత్తర్వులతో//

తెలనాకుల సురేష్ బాబు
అడ్వకేట్,
పర్చూరు - 523169

ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, లాయర్ పేట, సాయి బాబా గుడి ఎదురు లైను, త్యాగరాజ స్వామి వీధి, డోర్ నెం.7-1-15 రు కాపురస్థుడు ముదివర్తి కోటేశ్వరరావు గారి కుమారుడు ముదివర్తి వెంకటేశ్వరరావు అను నేను తెలియ జేయునది ఏమనగా, నేను మా ఇంటి వద్ద నుంచి విజయవాడ వెళ్ళుటకు ఒరిజినల్ డాక్యుమెంట్లుతో ఆర్టిసి బస్టాండ్ కు వెళ్ళాను. డిపోలో బస్సు ఎక్కుతుండగా డాక్యుమెంట్లు పోయినవి. ఎంత వెతికినా కనిపించ లేదు. సదరు డాక్యుమెంట్లు ఒంగోలు సబ్ రిజిస్టారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.10519/2008 మరియు 8078/2011 ర్లుగా రిజిష్టరు అయివున్నవి. ఈ డాక్యుమెంట్లు దొరికిన వారు దయచేసి ఈ క్రింది చిరునామా గాని నా ఫోన్ నెంబర్ కు గాని తెలియపరచవలసిందిగా కోరుచున్నాను

ఇట్లు
చిరునామా:
ముదివర్తి వెంకటేశ్వరరావు
S/o ముదివర్తి కోటేశ్వరరావు
లాయర్ పేటసాయి బాబా గుడి ఎదురు లైను,
ఒంగోలు, సెల్ నెంబర్ 9966202619

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 9/2025

బిట్వీన్ :-

గుది బండి వీరారెడ్డి ....వాది

V/s

మువ్వల సుబ్రమణ్యం .... ప్రతివాది

To

మువ్వల సుబ్రమణ్యం S/o ఆంజనేయులు, పర్చూరు (Po) మరియు మండలం, బాపట్ల జిల్లా.

అను మీకు మీఅడ్రస్‌కు అనేకసార్లు ఈ దావా సమన్లు పంపిననూ చేరక తిరిగి వచ్చుచున్నందున ఈ పత్రిక ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టులో వాయిదా ది08-09-2025 న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా :- 08-09-2025

పర్చూరు

తేదీ : 04-09-2025 ఇట్లు

యార్లగడ్డ వెంకటేశ్వరరావు
వాది తరపు న్యాయవాది
పర్చూరు
Cell no :-9985534996

NOTICE
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
DISPUTE NO.30/2025

Between:

M/S.MARGADARSI CHIT FUND (P) LTD., NARASARAOPET. REP BY ITS FOREMAN/BR.MANAGER ... DISPUTANT

AND

MRS.K.MANEESHA AND OTHERS ...OPPONENTS

TO

OPPONENT NO.4: MRS.ANDRAJU MOUNIKA SRI, W/O.NAIDU RAMESH, A/A.31 YEARS, W/AS. SEC. GR. TEACHER, SPL.MUNICIPAL ELE. SCHOOL, DEGGUMALLIVARI PALEM, CHIRALA ROAD, BAPATLA DIST. R/O. D.NO.10-5-22/B, KOTRAVARI STREET, NEAR RAMALAYAM, GUNTUR ROAD, BAPATLA.

OPPONENT NO.5. MR.DONTHAGANI VENUGOPALA RAO, S/O.D.SUSEELA RAO, A/A.49 YEARS, OCC: PROP. M/S. DSR SEA FOODS, NIZAMPATNAM ROAD, OPP;GOVT.DEGREE COLLEGE, REPALLE. R/O.D.NO.10-30-108, NEAR TELEPHONE EXCHANGE, MPL.OFFICE Opp. ROAD, REPALLE.

Please take notice that the above dispute is filed against Opponent Nos.4 and 5 of you and 4 others for recovery of Rs.8,80,808/- (Rupees EIGHT LAKHS EIGHTY THOUSAND EIGHT HUNDRED AND EIGHT ONLY) and the same is posted to 20-09-2025 for the appearance of you i.e., Opponent Nos.4 and 5 before the Deputy Registrar of Chits, Narasaraopet, O/o.District Registrar, Narasaraopet at 10.30 A.M., if you failed to attend the O/o.Deputy Registrar of Chits, on that day the matter will be heard and decided exparte basis on the material available.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS, NARASARAOPET)

G.V.SUBRAHMANYAM
ADVOCATE FOR DISPUTANT

యువకుడు దారుణ హత్య

ఆపై మృతదేహం కాల్చివేత • గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేటలో సాయిబాబా గుడికి వెళ్లే రహదారికి సమీపంలోని ప్రైవేటు ప్లాట్‌లలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన గాలి చిన్న బ్రహ్మయ్య(24) దారుణ హత్యకు గురయ్యాడు. చిన్న బ్రహ్మయ్య దర్గా గ్రామంలో ఇంటి వద్ద ఉండగా స్నేహితులు రాత్రి సమయంలో బయటకు పిలిపించారు. తదనంతరం ఏం జరిగిందో తెలియదు కానీ చిన్న బ్రహ్మయ్యను గుర్తు తెలియని వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో హత్య చేసి, హత్య చేసిన ప్రదేశం నుంచి సుమారు 50 మీటర్ల దూరంలో ముళ్లపొదల వద్దకు లాక్కెళ్లి మృతదేహంపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. దర్గా గ్రామానికి చెందిన అతని మిత్రులు రాత్రి నుంచి ఇంటికి రాని చిన్న బ్రహ్మయ్యను వెతుకుతుండగా ముళ్ల పొదల వద్ద మృతదేహం తలపై కత్తిపోట్లతో పడి కాలిపోయి ఉండడం గమనించారు. చనిపోయి ఉన్న మిత్రుడి శరీరాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమరం మల్లికార్జున, బేస్తవారిపేట, కంభం

తమ్ముడి మృతదేహాన్ని పోలీసులకు చూపిస్తూ విలపిస్తున్న మృతుడి అక్క చిన్న కాశమ్మ

దారుణ హత్యకు గురైన గాలి చిన్న బ్రహ్మయ్య (ఇన్‌సెట్‌లో) చిన్న బ్రహ్మయ్య (ఫైల్)

ఎస్‌ఐలు ఎస్‌వి రవీంద్రారెడ్డి, బి నరసింహారావు, సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని కాలిన మృతదేహాన్ని, కత్తిగాట్లను పరిశీలించారు. ప్రశాంతంగా ఉన్న మండలంలో యువకుడు దారుణ హత్యకు గురికావడం మండలంలో సంచలనం రేపింది.

ఒక్కగానొక్క కొడుకును పొట్టన పెట్టుకున్నారు

మృతుడి తల్లి ఆవేదన

పది సంవత్సరాల క్రితం తన భర్త వీరభద్రుడు మరణించగా తన కొడుకు గాలి చిన్న బ్రహ్మయ్య ఉన్నాడనే ధైర్యంతో ముగ్గురు ఆడపిల్లలతో సంసారం నెట్టుకుంటూ వస్తున్నానని, అయితే ఉన్న నా ఒక్కగానొక్క కొడుకును పొట్టన పెట్టుకున్నారని హతుడు గాలి చిన్న బ్రహ్మయ్య తల్లి రవణమ్మ బోరున విలపించారు. ఆమె మృతదేహం వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతి చెందిన గాలి చిన్న బ్రహ్మయ్యకు ముగ్గురు అక్కలు పెద్ద కాశమ్మ, చిన్న కాశమ్మ, వీరేశ్వరి ఉన్నారు. తండ్రి మరణించిన తర్వాత కుటుంబానికి చిన్న బ్రహ్మయ్య చేదోడు వాదోడుగా ఉంటూ తమ మంచి చెడ్డలు చూసుకునేవాడని, ఒక్కగానొక్క తమ్ముడు మృతి చెందడంతో తమ మంచి చెడ్డలు చూసేవాడు ఎవరున్నారంటూ అక్కలు విలపించడం చూపరులను కలచివేశాయి. తన తమ్ముడి హత్య వెనుక ఎవరున్నారనేది నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు పోలీసులు వేడుకున్నారు.

డాగ్ స్క్వాడ్ రాక..

ఒంగోలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ బృందం హత్య జరిగిన సంఘటన ప్రదేశానికి చేరుకుంది. హత్య జరిగిన ప్రదేశంలో మృతుడి పాదరక్షలను వాసన చూపించారు. అనంతరం ఆ శునకం సరా సరి మృతదేహం వద్దకు వెళ్లి అక్కడి నుంచి మృతుడి ద్విచక్ర వాహనం వరకు వెళ్లింది. అక్కడ నుంచి సమీపంలోని జాతీయ రహదారి వెంట ఉన్న ఓ హోటల్‌లోకి వెళ్లింది. మరలా ఆ హోటల్ నుంచి ద్విచక్ర వాహనం వరకు వెళ్లి అక్కడ నుంచి మరో రోడ్డు ద్వారా అదే హోటల్ వద్దకు చేరుకుంది. దీనినిబట్టి హత్యలో పాల్గొన్న నిందితులు హోటల్ పరిసరాల్లో సంచరించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ద్విచక్ర వాహనం ఘటన జరిగిన ప్రాంతంలో లేకుండా హైవేకు సమీపంలోని హోటల్ వెనక ఉండడం, ద్విచక్ర వాహనానికి తాళం ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ హత్య ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. దీని వెనక ఎవరున్నారు అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సిఉంది.

మృతదేహాన్ని పరిశీలించిన వైసిపి ఇన్‌ఛార్జి కుందూరు

కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన గాలి చిన్న బ్రహ్మయ్యను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి కాల్చివేసిన విషయం తెలుసుకున్న వైసిపి గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుందూరు నాగార్జునరెడ్డి గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చిన్న బ్రహ్మయ్య నుంచి గ్రామంలో వైసీపీ కార్యకర్తగా పనిచేస్తున్నారని, సర్పంచికి కూడా వాదోడుగా ఉంటూ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడన్నారు. చిన్న బ్రహ్మయ్య దారుణ హత్యకు గురికావడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. అదే చిన్న బ్రహ్మయ్య హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రోడ్డు సేఫ్టీ అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు మీద లారీ డ్రైవర్లకు స్టిక్కర్లు దందా చేస్తున్న సమయంలో ఆ లారీ డ్రైవర్‌కు కోపం వచ్చి దూసుకుపోవటంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం నాడు శింగరాయకొండ మండలం కలికివాయి ఎమర్జెన్సీ ల్యాండింగ్ దగ్గర చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. రోడ్ సేఫ్టీ స్టిక్కరింగ్ అధికారులు టంగుటూరు శింగరాయకొండ ప్రాంతాల్లో రోడ్డుమీద వస్తున్న లారీలను నిలుపుదల చేసి రోడ్డు సేఫ్టీ స్టిక్కరింగ్ వేయించు కోవాలని దాని విలువ 200 రూపాయలు ఉంటుందని చెబుతూ వచ్చారు. గురువారం శింగరాయకొండలోని కలికివాయి కనుమల్ల మధ్యలో ఉన్న ఎమర్జెన్సీ లాండింగ్ వద్ద ఈ దందా మొదలుపెట్టారు. లారీలు వేగంగా వస్తున్న సమయంలో నిలుపుదల చేయాలని చెప్పడంతో ఆ లారీ డ్రైవర్ తమ జేబుకు ఎక్కడ చిల్లు పెడతారో అన్న ఉద్దేశంతో దూసుకు వచ్చాడు. రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ కైలాష్ లారీ దూసుకురావడంతో రోడ్ సేఫ్టీ స్టిక్కరింగ్‌లో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన గుడ్డు అనే వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో చేతికి తీవ్ర గాయం

గాయపడిన వ్యక్తి

అయింది. వెంటనే అక్కడే ఉన్న హైవే అంబులెన్స్‌లో ఒంగోలుకు తరలించారు. అయితే రోడ్డుమీద హైవే సేఫ్టీ స్టిక్కరింగ్ పేరుతో జరుగుతున్న ఈ దందాను లారీ ఓనర్ల ద్వారా సమాచారం తీసుకొని వారి ద్వారా వసూలు చేయాల్సిన అధికారులు అలా చేయకుండా లారీ డ్రైవర్ల దగ్గర వసూలు చేయడంతో లారీ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టాక్సు కట్టేటప్పుడు టోల్ గేట్ దగ్గర డబ్బులు కట్టేటప్పుడు ఇలాంటివి కూడా అలాంటి బిల్లుల్లో కట్టించుకోవాల్సిందిపోయి రోడ్డుమీద వేగంగా వస్తున్న లారీలను ఆపి ఇలా చేయడం ద్వారా అటు రోడ్డు సేఫ్టీ అధికారులకు ఇటు హైవే సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ డ్రైవర్ వేగంగా వెళ్లటం ద్వారా రోడ్ సేఫ్టీ స్టిక్కరింగ్‌లో పని చేస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు మధురై యువకుల అరెస్ట్

ప్రజాశక్తి-ఒంగోలుకలెక్టరేట్

ఒంగోలు రైల్వే స్టేషన్ ఎదురుగా రైల్వే కోచ్ క్యాంటిన్ సమీపంలో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు మధురైకు చెందిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె విజయ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ జనార్దన్‌రావు పర్యవేక్షణలో సిఐలు ఆర్ నరహరిరావు, ఎస్ రామారావు, ఎస్ఐ రాజేంద్ర, మౌలాలి, సిబ్బంది కలిసి ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాల్లో రవాణాకు సిద్ధంగా ఉంచిన గంజాయి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి పది 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు విశాఖపట్నం జిల్లాలోని విశాఖ నగరంలో పూజారి బుచ్చిబాబు అనే వ్యక్తి దగ్గర నుంచి కిలో రూ.3,500 చొప్పున మొత్తం 10 కిలోలను 35 వేల రూపాయలకి కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడులోని మధురై జిల్లాలో మధురైకి చెందిన తంబియన్ అనే వ్యక్తికి కిలో గంజాయి రూ.12,500కు అమ్మి లాభాలు గడిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడు పాండురాజన్ గతంలో ఒసారి విశాఖపట్నం

ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితులు

వెళ్లి గంజాయి కొనుగోలు చేసి మధురైలో అమ్మినట్లు విచారణలో అంగీకరించాడు .మరో నిందితుడు భాస్కర్ (మొదటిసారిగా) పాండిరాజన్‌కు తోడుగా విశాఖపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి మదురైకి వెళుతూ పట్టుబడ్డాడు.పాండి రాజన్ బైక్ మెకానిక్ కాగా భాస్కరన్ సెంట్రింగ్ పనులు చేస్తున్నారు.వీరిద్దరి నుంచి రెండు మొబైల్ ఫోన్స్ కూడా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీన పరుచుకున్నారు. నిందితులు, నేర సొత్తును తదుపరి చర్యల కోసం ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఏఈఎస్ జనార్దన్ తెలిపారు. దాడుల్లో వెంకటరావు, కానిస్టేబుళ్లు జయసూర్య, శ్రీనివాస్, నాగరాజు, బాలసుబ్బయ్య, వెంకటరావు రామిరెడ్డి, చలపతి, హర్ష కొండలరావు పాల్గొన్నారు.

బోయలపల్లిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డివిజన్‌లోని యర్రగొండ పాలెం మండలం బోయపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కనిపించకుండా పోయిన ముగ్గురు చిన్నారులు తండ్రి చేతిలో కిరాతకంగా హతమయ్యారు. ఆ తరువాత తండ్రి కూడా పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బోయపల్లి గ్రామం నుంచి కనిపించకుండా పోయిన చిన్నారుల మిస్టరీ వీడింది. ఆ గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు భార్యతో గొడవపడినట్లు తెలిసింది. తరచూ కుటుంబ కలహాలు ఉండేవని తెలిసింది. ఈ క్రమంలో భార్యపై కోపంతో ముగ్గురు చిన్నారులను తన మోటార్ సైకిల్‌పై తండ్రి వెంకటేశ్వర్లు తీసుకెళ్లాడు. ఇది జరిగి వారం కావస్తోంది. చిన్నారుల మిస్సింగ్‌పై పోలీసులు గాలింపు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో చిన్నారుల మృతదేహాలను, తండ్రి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించారు. ముందుగా తండ్రి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించారు. ఆ తరువాత పరిసర ప్రాంతంలో గాలింపు చేపట్టగా కుమారుడు శివధర్మ, కుమార్తె వర్షిణి మృతదేహాలను గుర్తించారు. ఆ తరువాత పెద్ద కుమార్తె మోక్షిత మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిసింది. చిన్నారులపై పెట్రోల్ చల్లి కాల్చి చంపినట్లు తెలిసింది. తండ్రి వెంకటేశ్వర్లు మాత్రం పురుగు మందు తాగి చనిపోయాడు. వారం రోజులుగా డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ నాగరాజు, ఎస్‌ఐలు విజయభాస్కర్, తిరుపతిరెడ్డిలతో పాటు పోలీసు సిబ్బంది డ్రోన్‌ల సాయంతో గాలింపు చేపట్టి మృతదేహాలను కనుగొన్నారు. అభం శుభం తెలియని చిన్నారులను అతి దారుణంగా కన్నతండ్రే చంపడం సంచలనం సృష్టించింది.

మంత్రి సత్యకుమార్‌తో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గిద్దలూరు

అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

చిరుత దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

చిరుత పులి దాడిలో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన పెద్దదోర్నాల సమీపంలోని శ్రీశైలం మార్గంలో పెద్ద మలుపు వద్ద గురువారం జరిగింది. తెలిసిన వివరాలు ఇలా...

గాయపడిన ఆవుల లాలయ్య

మండలంలోని బొమ్మలా పురం నుంచి బోడేనాయక్ తండా మీదుగా ఆవుల లాలయ్య అనే వ్యక్తి దోర్నాలకు మోటారు సైకిల్‌పై వస్తుండగా.. అదే సమయంలో చిరుతపులి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో దాడి చేసింది. ఆవుల లాలయ్య బైక్‌పై నుంచి కింద పడ్డాడు. చిరుత దాడిలో స్వల్పంగా గాయపడ్డాడు. అనంతరం పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు.

అంగన్‌వాడీలపై యాప్‌ల పనిభారం తగ్గించాలి

అంగన్‌వాడీ యూనియన్ మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్

ప్రజాశక్తి - రేపల్లె

అంగనవాడీ కార్యకర్తలపై రకరకాల యాప్‌ల పేరుతో చేయిస్తున్న పనిభారం తగ్గించాలని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా చేయాలని, యాప్‌లు పనిచేసే విధంగా కొత్త ఫోన్లు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక సిఐటీయు కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలో గత మూడేళ్లలో చేసిన పోరాటాలు, సమస్యలపై చర్చించుకుని, యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. మహాసభలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె జాన్సీ మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రభుత్వాలు వేతనాలు పెంచుతూ ప్రతిపక్షంలో

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్

ఉన్నప్పుడు సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని మణిలాల్ గుర్తు చేశారు. యాప్స్ భారం తగ్గించడానికి నాయకులతో చర్చలు చేసిన పద్ధతుల్లో కింద స్థాయి వరకు అధికారులకు తెలియజేసి పని భారాన్ని తగ్గించాలని కోరారు. కొత్త ఫోన్స్ వెంటనే ఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఎఫ్ఆర్ఎస్ సమస్యగా ఉందని, దీన్ని రద్దు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంలో అధికారులు చొరవ చేయాలని అన్నారు. వెంటనే అర్హులైన హెల్పర్లకు పదోన్నతి ఇవ్వాలని కోరారు. దేశ, రాష్ట్రవ్యాప్త పిలుపులు జయప్రదం చేస్తూ ప్రాజెక్టు పరిధిలో వచ్చే సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని చెప్పారు. నూతన కమిటీ అధ్యక్షురాలు కె రత్నకుమారి, కార్యదర్శి టి నిర్మల జ్యోతి, కోశాధికారి ఎన్ కృష్ణకుమారి, గౌరవాధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ఉపాధ్యక్షులు డి జ్యోతి, కె ఝాన్సీ, ఆరోగ్యమ్మ, సహాయ కార్యదర్శులు రత్నకుమారి, అఖిల, పార్వతి, సభ్యులు మోహనకుమారి, ఇందిరా, వెన్నెల, కోటేశ్వరమ్మ, మంజూష, వరలక్ష్మి ఎన్నికయ్యారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న హరిబాబు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారని తెలుగుదేశం సీనియర్ నాయకులు కామేపల్లి హరిబాబు గురువారం తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నూతలపాడు గ్రామానికి చెందిన షేక్ పీర్దోస్, మార్టూరు గ్రామానికి చెందిన షేక్ మోమిన్, నాగులపాలెం గ్రామానికి చెందిన కొల్లా సురేష్ బాబుకు మంజూరైన రూ.5.40లక్షల విలువైన చెక్కులను క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తిలక్, వెంకట్‌తో కలిసి హరిబాబు అందజేశారు.

'ప్రకాశం'లో కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి - ముండ్లమూరు

ముండ్లమూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించాలని స్థానిక బస్టాండ్ సెంటర్లో బేతపూడి రామారావు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు రామారావు మాట్లాడుతూ తమ మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని, కొత్తగా ఏర్పాటు చేసే మార్కాపురం జిల్లాను తాము స్వాగతిస్తున్నామని అన్నారు. ముండ్లమూరు మండలం మార్కాపురానికి 84కిలోమీటర్ల దూరంలో ఉందని, వివిధ పనుల కోసం రైతులు, మండలం అధికారులు మార్కాపురం వెళ్లాలంటే 3గంటల సమయం పడుతుందని అన్నారు. అదే ఒంగోలు వెళ్లాలంటే గంటలో వెళ్లవచ్చని అన్నారు. ఇన్ని ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పరిశీలించి సమీక్ష చేయాలని కోరారు. ప్రస్తుతం దర్శి నియోజకవర్గంలోని మూడు మండలాలు దర్శి, దొనకొండ, కురిచేడు, కనిగిరి రెవిన్యూ డివిజన్లో ఉన్నాయని అన్నారు. ముళ్ళమూరు, తాళ్లూరు మండలాలు ఒంగోలు రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయని అన్నారు. 45కిలోమీటర్ల దూరంలో ఉందని అన్నారు. ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లోనే ఉందని అన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రం దర్శి సీఐ వై రామారావుకు అందజేశారు. ధర్నాలో సొసైటీ అధ్యక్షులు మేదరమెట్ల వీర నారాయణ, ఎల్ఐసి క్లబ్ మెంబర్ ఎండిఆర్‌టి కంకణాల చలపతిరావు, ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షులు ఎస్‌కె మస్తాన్‌వలి, వికలాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుమ్మిత పేరారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పులికొండ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మేదరమెట్ల కొండలరావు, ముప్పాళ్ళ కోటేశ్వరరావు, కంకణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ

లింగ వివక్ష చూపొద్దు..

ప్రజాశక్తి - పర్చూరు

సమాజంలో తల్లి, దండ్రులు తమ పిల్లల పట్ల లింగ వివక్షత చూపరాదని సిడిపిఓ జి సుభద్ర తెలిపారు. మండలంలోని ఉప్పుటూరు అంగన్‌వాడి కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకల్ప కార్యక్రమం కింద జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని సూచించారు. గర్భస్థ ఆడ శిశువుల హత్యలు చేయడం చట్టరీత్యా నేరమవుతుందని తెలిపారు. లింగ వివక్షత వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతాయని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బి సునంద, హెూమియో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

టీచర్ రోజా రమణిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన ఓ రోజా రమణిని మండలంలోని వెల్లటూరు ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ఒక నమ్మకాన్ని సమాజానికి కలిగించడంలో ముఖ్య పాత్ర పోషించిన రోజా రమణి అభినందనీయులని అన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునేందుకు కృషి చేయాలని అన్నారు. గతంలో తను పని చేసిన అన్ని పాఠశాలల్లోనూ పిల్లల ఎన్రోల్మెంట్ పెంచడానికి, పాఠశాలకు వచ్చిన ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య అందించడానికి విశేషమైన కృషి చేశానని తెలిపారు. రోజారమణి ఈ కృషిని కొనసాగించాలని కోరారు. మిగిలిన ఉపాధ్యాయులు ఆమె కృషిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి యు శ్రీనివాసరావు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారంచేడు : స్థానిక ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న కె విజయ చంద్ర జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా యుటిఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భవనం శ్రీనివాసరెడ్డి, రావి పద్మావతి, జిల్లా సెక్రటరీ పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె విజయ చంద్ర

ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 26 పంచాయతీల కార్యదర్శిలతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామిత్వ సర్వే, పి4 సర్వే, కౌసలం సర్వే, తల్లికి వందనం వంటి సర్వేలు ఎవరెవరు వెనకబడ్డారో వారంతా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలసత్వం వహించే సరిగ్గా పనిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. హాజరు వేయాలని చెప్పారు. సర్వేలు పూర్తి చేయించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - పర్చూరు

విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే విద్యా రంగంలో సేవలకు ఉపాధ్యాయులు అంకితం కావాలని ఎంఈఓ శివ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి సమావేశ హాల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కెవిడి ప్రసాదు, గోవిందరావు, రత్న మంజరి, ఎ అనంతమ్మ, ఎన్ నాయుడమ్మ, శ్రీధర్ బాబు, ఈ బ్రహ్మయ్య, ఎన్ జయలక్ష్మి 8 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం ఎంతో గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరామయ్య, ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి, డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించిన అధికారులు

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ప్రజాశక్తి - అద్దంకి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పుట్టంరాజు కళాక్షేత్రంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఘనంగా గురువారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ యు దేవపాలన అధ్యక్షత వహించారు. సభలో ఎస్‌టిఒ షేక్ అబ్దుల్ ఖాదర్, అధ్యక్షులు రావుల బాపయ్య చౌదరి, కార్యదర్శి కరి కమలేశ్వరరావు మాట్లాడారు. వారణాసి రఘురామశర్మ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ట్రస్టు తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ పురస్కార గ్రహీతలకు రూ.వెయ్యి నగదు, నూతన వస్త్రాలు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత, గణిత ఉపాధ్యాయుడు నారాయణం శ్రీనివాసాచార్యులు, సోషల్ ఉపాధ్యాయుడు కెవి పోలిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పొడపాటి కృష్ణారావు, సెకండరీ గ్రేడ్ టీచర్ కోట రామలక్ష్మమ్మను సన్మానించారు. ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల సేవలకు లభించే గౌరవానికి ప్రతీకని అభినందించారు. ఎలాంటి దరఖాస్తులు, సిఫార్సులు లేకుండా ఉపాధ్యాయుల ప్రతిభ, పనితీరు గుర్తించి పురస్కారాలు అందిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కార్యక్రమంలో చుండూరి మురళీసుధాకరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, చప్పిడి వీరయ్య, కుందా సుబ్బారావు, కూరపాటి రామకోటేశ్వరరావు, కె కుమార్, యు రాజశేఖర్, మక్కెన వెంకటేశ్వర్లు, లక్ష్మీశ్రీనివాసరావు, ఎం విష్ణు, సిహెచ్ లక్ష్మీనారాయణ, జి శ్రీనివాసులరెడ్డి, ఎలీషా పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 13న శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని, రాజీ చేసుకోదగిన అన్ని రకాల సివిల్, క్రిమినల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు పరిష్కరించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె ప్రశాంతి గురువారం తెలిపారు. రాజీ చేసుకోవడం ద్వారా సమయం ఆదా అవడంతోపాటు ఆర్థిక భారం తప్పుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే ప్రామాణికమని తెలిపారు. సివిల్, క్రిమినల్, కుటుంబ, ప్రీలిటిగేషన్ కేసులు రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందాలని కోరారు. పోలీసు అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కక్షి దారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొరత లేకుండా

యూరియా అందుబాటులో ఉంచాలి

ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులకు కొరత లేకుండా యూరియా అందుబాటులో ఉంచాలని ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ తెలిపారు. వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. రైతులను దష్టిలో ఉంచుకుని ఎలాంటి సమస్యలు రాకుండా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సిఎస్ చెప్పారు. భూగర్భ జలమట్టం పెరగడానికి అధికారులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో బోర్లు వేయాలని ఆయన సూచించారు. వాటర్ బులిటన్ ప్రతినెల విడుదల చేయాలని ఆదేశించారు. పీఎం కుసుమ పథకం అమలు వేగంగా చేయాలన్నారు. సౌర విద్యుత్ వినియోగంలో యూనిట్ ల స్థాపన లో జాప్యం ఉండరాదని సూచించారు. డి డి ఆర్ సి సమావేశాలు ప్రతి త్రైమాసంలో ఒకసారి విధిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజల సంతప్తి స్థాయి పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను కలెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందడమే లక్ష్యం అన్నారు. బాగా పనిచేస్తున్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను గుర్తించి, అందులో పని చేసే సిబ్బందికి అవార్డులు ఇవ్వాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు వేగంగా చేపట్టాలన్నారు. ఎక్కడ సమస్యలు రాకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గోదాములు నిండితే సమీప ప్రాంతాల్లోని గోదాములకు పొగాకును తరలించాలని సూచించారు.

యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఏపీ చీఫ్ సెక్రటరీ విజయనంద్ దష్టికి తీసుకువెళ్లారు. అన్ని మండలాల్లో రైతులకు చాలినంత యూరియా సిద్ధంగా ఉంచామన్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. బ్లాక్ బర్లీ పొగాకును జిల్లాలో రూ.81 కోట్ల మేర కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.22 కోట్ల నగదును రైతులకు పంపిణీ చేశామన్నారు. పొగాకు కొనుగోలులో జిల్లాకు ఇచ్చిన లక్ష్యంలో 78 శాతం పురోగతి సాధించామన్నారు. కొనుగోలు వేగం చేశామన్నారు. నిల్వ చేయడానికి గోదాములను గుర్తించి, కొనుగోలు చేసిన పొగాకును తరలిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షల కోసం కాలేజీల గుర్తింపు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

అటవీ శాఖలోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల 7వ తేదీ జరిగే స్క్రీనింగ్ పరీక్షల కోసం జిల్లా కేంద్రమైన ఒంగోలు, దాని శివారులోని 10 కాలేజీలను అధికారులు గుర్తించారు. ఈ పరీక్షలు సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం డిఆర్ఓ బి.చిన ఓబులేసు అధ్యక్షతన ఏపీపీఎస్సీ అధికారుల సమక్షంలో ప్రకాశం భవనములో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు 7052 మంది, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు 1153 మంది అభ్యర్థులు జిల్లా నుంచి పోటీ పడుతున్నారు. ఆఫ్ లైన్ పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ ఈ పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో ఆదేశించారు.

సీనియర్ జర్నలిస్టు వలీసాహెబ్ కన్నుమూత

- గుండెపోటుతో మృతిచెందిన ప్రజాశక్తి యర్రగొండపాలెం విలేకరి..
- నేడు వై.పాలెంలో అంత్యక్రియలు

వలీసాహెబ్ (ఫైల్)

వలీసాహెబ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-మార్కాపురం

అభ్యుదయ వాది, సామాజిక స్పృహ కలిగిన ప్రజాశక్తి యర్రగొండపాలెం విలేకరి షేక్ వలీసాహెబ్ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆర్ఎంపి వైద్యునిగా కూడా రాణించిన డాక్టర్ వలీసాహెబ్‌గా ప్రజలందరికీ దగ్గరయ్యాడు. 'ప్రజాశక్తి తెలుగు దినపత్రిక'లో యర్రగొండపాలెం విలేకరిగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నారు. పత్రికా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సహచర మీడియా మిత్రులందరికీ సఖ్యతగా ఉండేవారు. బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో కథనాలు ప్రజాశక్తి పత్రిక ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. అనేక సమస్యలను పరిష్కరించగలిగారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి విశేష కృషి చేశారు. సిపిఎం నేతగా కొనసాగారు. పీడిత ప్రజల పక్షాన ఆందోళనలు చేశారు. యర్రగొండపాలెంలో పేదల కోసం కొప్పుకొండ ఇళ్ల స్థలాల కోసం సిపిఎం నిర్వహించిన పోరాటంలో వలీసాహెబ్ కీలకంగా వ్యవహరించారు. ఆ ఉద్యమాన్ని అన్నీ తానై నడిపించాడు. ఆ పోరాటం సుమారు 350 మంది పేదలకు నీడ కల్పించింది. గుంటూరు జిల్లా గుమ్మనంపాడులో డాక్టర్ షేక్ వలీసాహెబ్ జన్మించాడు. విద్యాభ్యాసం యర్రగొండపాలెంలో కొనసాగింది. చదువు పూర్తయిన తరువాత యర్రగొండపాలెంలో స్థిరపడ్డారు. వైద్యంపై ఆసక్తి కలిగిన వలీసాహెబ్ ఆర్ఎంపి వైద్యునిగా మంచి పేరు గడించాడు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేవారు.

టిడిపి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు సంతాపం

వలీసాహెబ్ మృతి బాధాకరమని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. వలీసాహెబ్ ప్రజల పక్షాన నిలిచిన జర్నలిస్ట్‌గా పేరు గడించారన్నారు. పత్రికా రంగంలో వలీసాహెబ్ లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. వలీసాహెబ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిపిఎం సంతాపం

యర్రగొండపాలెం ప్రజాశక్తిలో సీనియర్ పాత్రికేయులుగా కొనసాగుతున్న డాక్టర్ షేక్ వలీసాహెబ్ అకాల మరణానికి సిపిఎం సంతాపం తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు దగ్గుపాటి సోమయ్య, యర్రగొండపాలెం శాఖ కార్యదర్శి సత్యనారాయణ, సిపిఎం నాయకులు అమీర్‌బాష, మార్కాపురం ప్రజాశక్తి డివిజన్ కో ఆర్డినేటర్ అల్లు వీరారెడ్డి, రైతు సంఘం మార్కాపురం డివిజన్ నాయకులు గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు వలీసాహెబ్ భౌతికాయాన్ని సందర్శించి.. నివాళులు అర్పించారు.

– వలీసాహెబ్ మృతికి కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్రా మాల్యాద్రి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

'ప్రజాశక్తి' నివాళి

విలేకరి వలీసాహెబ్ మృతి పట్ల 'ప్రజాశక్తి' మేనేజ్‌మెంట్, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. ఒంగోలు ఎడిషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం సంతాపం సభ నిర్వహించారు. ముందుగా వలీసాహెబ్ చిత్రపటానికి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు పూలమాల వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమానికి బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి.బ్రహ్మం అధ్యక్షత వహించి.. మాట్లాడారు. వలీసాహెబ్ మృతి ప్రజాశక్తికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఆర్.తారకరామారావు, వివేకానంద, సబ్‌ఎడిటర్లు శ్రీనివాస్, శ్యాంబాబు, మురళి, సిబ్బంది అశోక, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సంతాపం

ప్రజాశక్తి విలేకరి వలీసాహెబ్ మృతికి సిపిఐ సంతాపం ప్రకటించింది. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కష్ణగౌడ్, సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పలువురు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ యర్రగొండపాలెం ప్రాజెక్టు కార్యదర్శి మల్లేశ్వరి, సీతామహాలక్ష్మి ఉన్నారు.

ఒంగోలు, ప్రజాశక్తి కార్యాలయంలో నివాళులర్పిస్తూ..

కలెక్టర్‌తో 'నూకసాని' భేటీ

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

సూర్యలంకలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను సమీక్షించడానికి ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ గురువారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళితో భేటీ అయ్యారు. మూడు రోజుల కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించడానికి పూర్తి సహకారం అందిస్తామని బాలాజీ తెలిపారు. బాపట్ల జిల్లాను మంచి టూరిజం హాబ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యమని కలెక్టర్ ఈసందర్భంగా తెలిపారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

- వైసిపి ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలపై నిర్లక్ష్యం
- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 49 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను పునరుద్ధరించాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. అమరావతిలోని సెక్రటేరియట్లో మంత్రితో ఆయన భేటీ అయ్యారు. గత వైసిపి ప్రభుత్వంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన స్కీంలు కనీస మరమ్మత్తులు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయని మంత్రికి వివరించారు. నియోజకవర్గంలో 49 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయని తెలిపారు. వీటిలో ఎపిఎస్ఐడిసి ఆధ్వర్యంలో 37, ప్రైవేటుగా 12 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయని పేర్కొన్నారు. వీటి ద్వారా సుమారు 48,373 ఎకరాలకు

మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎంఎల్ఎ ఏలూరి

నీరందుతోందని తెలిపారు. గతంలో ఈ స్కీముల ద్వారా నిర్విరామంగా నీరు అందించినట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో స్కీంలను పట్టించుకున్న నాథుడు లేడని తెలిపారు. స్కీములన్ని శిథిలావస్థకు చేరి పని చేయక పోవడంతో సాగునీరు లేక రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత నిధులతో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన స్కీంల పునరుద్ధరణకు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు అవసరమైన నిధుల మంజూరు చేసి వేలాది ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా చొరవ చూపాలని కోరారు. గతంలో సిఎం చంద్రబాబు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల సమస్య వెల్లడించినట్లు గుర్తు చేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. మొత్తం 49 స్కీంల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా స్కీంలకు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, పంప్‌సెట్లు, పైప్‌లైన్లు, ఎలక్ట్రికల్ సామాగ్రి దెబ్బతిన్నాయని, తక్షణమే మరమ్మత్తులు అవసరమని చెప్పారు. ఈ పనులు చేపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతులు, కౌలు రైతులు లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. తన ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంఎల్ఎ ఏలూరి తెలిపారు.

శక్తీ యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న ఎస్ ఐ అనిత

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

ప్రజాశక్తి - కర్లపాలెం

శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని శక్తి పోలీసు ఎస్ఐ అనిత అన్నారు. మండలంలోని పెదగోళ్ల పాలెం జెడ్పి ఉన్నత పాఠశాల బాలికలకు శక్తి యాప్, గుడ్ టచ్ బాడ్ టచ్, చైల్డ్ హెల్ప్ లైన్, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు ఆపదలో చిక్కుకున్న మహిళలు శక్తీ యాప్ ఓపెన్ చేసి అందులో ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే సంఘట స్థలంకు పోలీసులు చేరుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్క మహిళ తమ ఫోన్లో శక్తీ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పత్తిపాటి సుభాషిణి, ఉపాధ్యాయులు ఆదంబి, శ్రీనివాసరావు, బాపూజీరెడ్డి, దత్, వెంకటేష్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ముగిసిన యునెక్స్ట్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చీరాల

ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఉన్నతి ఆధ్వర్యంలో నిర్వహించిన యునెక్స్ట్ శిక్షణ తరగతులు స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారంతో ముగిశాయి. గత నెల రోజులుగా జరిగిన శిక్షణలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, ఇంటర్వ్యూలు, డిబేట్, పబ్లిక్ స్పీకింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, జనరల్ సైకాలజీ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ట్రైనర్, చేంజ్ మేకర్ కె రామకృష్ణారెడ్డి విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ప్రిన్సిపాల్ ఎన్ మురళి మాట్లాడుతూ ప్రస్తుత కాంపిటేటివ్ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి ప్రణయ్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, వాల్యూస్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రతి విద్యార్థికి అత్యంత కీలకమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ రత్నపాప, నాన్ టెక్నికల్ ఆఫీసర్ జి నాగ వెంకట సాయి ప్రసాద్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం హారిక పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాగాణి పొలంలో సాగు చేసిన వరి పంటకు విద్యుత్ మోటార్ ద్వారా నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై కౌలు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దపులివరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వాకా శరత్ (29) అనే కౌలు రైతు కౌలుకు భూమిని తీసుకొని సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేసి నీరు డెలివరీ అయ్యే పైపుపై చేయవేసి నీరు తాగుతున్నాడు. ఆ సమయంలో నీటి పైపుకు విద్యుత్తు సరఫరా జరగటంతో శరత్ షాక్‌కు గురై కిందపడి కొట్టుకుంటున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి వెల్లటూరు గ్రామ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనం ద్వారా తెనాలి వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు. కాగా శరత్ మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య కుమార్తె ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

తిమ్మాయపాలెంలో టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భట్టిప్రోలులో ఉపాధ్యాయ దినోత్సవ దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల నందు సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా హెచ్ఎం పి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు భాషా పండితులు వివిఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యాయులు ఆర్ అశోక్ కుమార్, ఆర్ ఏడుకొండలు, టి ప్రసాదరావు, పి బాబురావు, ఎ ధనలక్ష్మి, సిహెచ్ రామ్మోహనరావు, పిఈటి రవి బాబు, పివి రత్న ప్రసాద్, సిఆర్‌పి ఎం రమేష్‌ను సత్కరించారు. బొమ్మనంపాడు జెడ్పి ఉన్నత పాఠశాలలో జరిగిన సభలో 10వ తరగతి విద్యార్థి గోరంట్ల పవన్ కళ్యాణ్ సభాహ్వానం పలికారు. హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి సభాధ్యక్షత వహించారు. విద్యార్థులు గోరంట్ల ప్రహర్షిత, అమృతలూరి సుమలత, బత్తినీడి హరిప్రియ, ఈమని పావని, కరణం అనూష, గోరంట్ల నాత్విక్ గౌతమ్‌కు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, పొత్తూరి వెంకట్రావును శాలువా, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ హజ్రత్ అలీ, దామా నాగేశ్వరరావు, కెఎన్‌జె శ్రీనివాస్, చాగంటి సుబ్బారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామంలోని ఎఎస్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ కొల్లా విజయ్ కుమార్ అధ్యక్షతన 10మంది ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిలుకూరి గోపి, క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడారు. రోటరీ సంస్థ తమ పాఠశాలకు గతంలో విద్యార్థులు కూర్చునేందుకు 65 బల్లలు, ప్రతి ఏటా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి, నోటు పుస్తకాలు, సైకిళ్ళు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఎంఈఓ చిలుకూరి గోపి మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవలు ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, ఎజి నాగబైరు శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, కొల్లా సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం బెల్లం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని సూరేపల్లి హెచ్ఈ పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. పాఠశాల హెచ్ఎం పడవల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యపల్లి విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాల హెచ్ఎం కె శ్రీనివాసశర్మ మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యతను సమాజానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని అన్నారు. ఆయన జన్మదినోత్సవం రోజునే ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషం అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ అంచెలంచలిగా రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతి ఒక్కరికీ ఆదర్శం అన్నారు. ఆయన 138వ జన్మదినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు గురుపూజోత్సవం జరుపుకోవటం గర్వకారణం అన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పుష్ప గుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు వాసుదేవ మూర్తి, డి నాగలక్ష్మి, జెవిఎల్ గణపతి, జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా స్థానిక రాయల్ హై స్కూల్ నందు ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, స్వప్న, ఇన్‌చార్జ్ కుడారి మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల విద్యార్థులు గౌరవంతో మెలగాలని డైరెక్టర్ రవీంద్ర బాబు సూచించారు. హెచ్ఎం బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పర్చూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

మార్టూరు రాయల్ స్కూలు ఉపాధ్యాయులకు సత్కారం

మునిసిపల్ డిఈకి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

మెరక తోలాలని వినతి

ప్రజాశక్తి - బాపట్ల

అకాల వర్షాలతో జగనన్న కాలనీలో నీరు నిలిచిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్లు మేరక తోలి ఎత్తు పెంచాలని కోరుతూ పాడిసన్‌పేట జగనన్న కాలనీవాసులు మున్సిపల్ డిఈ కృష్ణారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లన్నీ మరింత పల్లం కావడంతో వర్షం నీరు నిలిచి విష పాములు సంచరించడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఇక దోమల బెడదతో వృద్ధులు, పసిపిల్లలు, బాలింతలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. దీనికి తోడు వీధి దీపాలు వెలగడం లేదని అన్నారు. అంతర్గత రోడ్లు మెరక లేకపోవడంతో వర్షం నీరు వీధుల్లో నిలవడంతో మోకాళ్ళ లోతు నీళ్లలో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు అధికారులు, రాజకీయ నాయకులకు సమస్యను పలుమార్లు అర్జీ ద్వారా విన్నవించు ఉన్నప్పటికీ సమస్య యధాతథంగానే కొనసాగుతుందని అన్నారు. దయనీయ పరిస్థితిల్లో జగనన్న కాలనీలో జీవనం సాగించాల్సి వస్తుందని అన్నారు. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేసి అంతర్గత రోడ్లకు మెరకలు తోలాలని కోరుతూ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శరత్, కాలనీవాసులు చంటి, మహిళలు పాల్గొన్నారు.

హోమియో మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరులో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ స్థానిక జడ్పీ హై స్కూలు విద్యార్థినీ, విద్యార్థులకు ముందు జాగ్రత్తగా హోమియో నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, మరుగుదొడ్లను, తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే త్రాగాలని, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. బహిరంగ మల విసర్జన మానేయాలని చెప్పారు. భోజనానికి ముందు హ్యాండ్ వాష్ తప్పకుండా చేసుకోవడం, దోమ తెరలు వాడటం, వ్యక్తిగత పరిశుభ్రత వంటివి పాటించడం ద్వారా విష జ్వరాలు, అంటువ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అన్నారు. అందరూ జాగ్రత్తలు పాటించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో తమవంతు కృషి చేయాలని కోరారు. అనంతరం అధ్యాపకులందరికీ ముందుస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల ఎన్ఫోర్స్‌మెంట్ టీం ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు పురుగు మందు డీలర్లు, వ్యవసాయ సొసైటీ, రైతు సేవ కేంద్రల సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహశీల్దారు లక్ష్మీనారాయణ, ఎస్ఐ కమలాకర్, ఎఒ తిరుమలరావు మాట్లాడారు. ఎరువుల డీలర్ల దగ్గర ఉన్న ఎరువుల వివరాలు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అదే విధంగా రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వాలని, ఈ పాస్ యంత్రంలో ఉన్న స్టాకు భౌతికంగా ఉన్న స్టాకు సమానంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్టాక్ రిజిస్టర్లు బిల్ బుక్స్ అప్డేట్లో ఉంచుకోవాలని తెలిపారు. ఎరువులు ఎంఆర్‌పి కన్నా ఎక్కువ ధరలకు అమ్మితే డీలర్లపై ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండలంలో ఎరువులు కొరత సృష్టిస్తే అటువంటి డీలర్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అద్దంకి : ఎరువుల దుకాణాయజమానులు రైతులుకు మాత్రమే ఎరువులు విక్రయించాలని సిఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పి ధరలకు ఎరువులు విక్రయించాలని సూచించారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టించవద్దని చెప్పారు. దుకాణాల్లో రైతులకు ధరలు తెలిసే విధంగా పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులు అధిక మొత్తంలో నిల్వలు చేసి కొరత సృష్టించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఇప్పుడే వ్యవసాయ పనులు, వరి నాట్లు మొదలవుతున్నాయని అన్నారు. దీనికి తగ్గట్లుగా ఎరువులు రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితోపాటు ఎరువుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన నరేంద్రవర్మ

సంక్షేమ పథకాలు సూపర్ సక్సెస్

ప్రజాశక్తి - బాపట్ల

ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌లో భాగమైన స్త్రీ శక్తి సూపర్ సక్సెస్ అని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బాపట్ల నుండి ఆర్టిసి డిప్యూటి డిఒ సామ్రాజ్యంతో కలిసి పిట్టలవానిపాలెం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై మహిళల్లో మంచి స్పందన ఉందని పలువురు మహిళలు పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా చేకూర్చిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పివి పాలెంలో స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సెంటర్ వద్ద 'సూపర్ సిక్స్ – సూపర్ హిట్' బహిరంగ సభ నిర్వహించారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని ఎడ్లపల్లి గ్రామ శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు 2022 జులై 22న జరిగిన చోరీ ఘటనలో ముద్దాయిలు కారంపూడి విజయ్ కుమార్, తాటిపర్తి సాయి, బండికట్ల పవన్ కళ్యాణ్‌కు సీనియర్ సివిల్ జడ్జి ఆకా పవన్‌కుమార్ ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సిఐ శ్రీనివాసరావు తెలిపారు. గుడి పూజారి దివి శ్రీనివాసాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి విచారణ చేసినట్లు తెలిపారు. గుడిలో 20 వెండి వస్తువులు, విజయ గణపతి ఆలయంలో మరో 10 వెండి వస్తువులు దొంగిలించినట్లు ఆలయ ట్రస్టీ పెన్నా వెంకటేశ్వర్లు చుండూరు పోలీసు స్టేషన్లో అప్పట్లో ఫిర్యాదు చేశారు. గత ఏడాది ఆగస్టులో ముద్దాయిలను అప్పటి ఇన్స్పెక్టర్ సిహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు ఆలపాడు వంతె వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుండి వెండి వస్తువులు స్వాదీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. తెనాలి కోర్టులో కేసను విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఈ కేసులో అప్పటి హెడ్ కానిస్టేబుల్ బి రామయ్య ఎఫ్ఐఆర్ నమోదు చేయగా కోర్టులో సీనియర్ ఎపిపి పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు కానిస్టేబుల్ మల్లేశ్వరరావు సహకరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని పి గుడిపాడు గ్రామానికి చెందిన మోదుగుల వెంకటేశ్వరరెడ్డి (67) వెంకటాపురం హైవే వద్ద ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా గుంటూరు నుండి ఒంగోలు వస్తున్న కారు వేగంతో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎస్‌కె అహమ్మద్ రఫీ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని అద్దంకి వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- హారీస్‌పేటలో ఘటన
- మృతదేహం ఏరియా వైద్యశాలకు తరలింపు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని హారీస్‌పేటలో ఓ యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెంది కనిపించడం స్థానికుల్లో గురువారం కలకలం రేపింది. చిలచెట్ల మధ్యలో కనిపించిన శవాన్ని చూసి ప్రజలు భయభ్రాం తులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హారీస్‌పేటకు చెందిన పేర్లి కోటేశ్వరరావు (40) వృత్తిరీత్యా పెయింటింగ్ పనులు చేసుకుంటు న్నాడు. రోజు వారి కూలితో కుటుంబాన్ని పోషించు కుంటూ జీవించేవాడని స్థానికులు చెబుతున్నారు. అతడి మృతదేహం అదే పేటలోని చెట్ల మధ్య కనబ డటంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. ప్రాథమిక సమాచారం సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు కోటేశ్వరరావుకు భార్య, పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి మరణానికి గల కారణాలు స్పష్టత రావడానికి పోస్టుమార్టం నివేదిక కీలకమవుతుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో హారీస్‌పేటలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతికి గల పూర్తి వివరాలు, అనుమానాల నివృత్తి పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పేర్లి కోటేశ్వరరావు (ఫైల్‌ఫోటో)

అవగాహన కోసమే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - రేపల్లె

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తొంది కార్యక్రమం చేపట్టిందని ఎడిఎ ఎ లక్ష్మి చెప్పారు. జిఎపి, భూసార పరిరక్షణ, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం, రాయతీపై విత్తనాల సరఫరా, గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తి, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రీయ వ్యవసాయం వంటి శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఉప్పూడిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ పొలంబడికి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిలో 25 మంది రైతులు ఉంటారని, వారిని ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సమతుల్యమైన ఎరువులు, నీరు వంటి సమగ్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించే విధంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. నాణ్యమైన దిగబడులు పొందేలాగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్ ప్రయోగం ద్వారా రైతులకు 25శాతం, 50శాతం ఆకుల కత్తిరింపు, పక్షిస్థావరాల ఏర్పాటు వంటి పద్ధతులను తెలిపారు. కార్యక్రమంలో విఎఎ గంగాభవాని, నాచురల్ ఫామింగ్ ప్రతినిధి వినయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మి

ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ పురస్కారానికి శ్రీకాంత్

ప్రజాశక్తి - వేమూరు

విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేస్తూ ప్రజాధనాన్ని సద్వినియోగ పరుస్తూ ప్రజా పాలనలో పారదర్శకతను పెంచడానికి కృషి చేస్తున్న కొన్నాబత్తుల శ్రీకాంత్‌కు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అందించే పురస్కారానికి ఎంపిక కావడం తెలుగుజాతికి గర్వకారణమని జనసేన నాయకులు సోమరౌతు బ్రహ్మం అన్నారు. వరల్డ్ లీడర్ సమ్మిట్ ప్రకటించిన పురస్కారాలలో పబ్లిక్ ట్రాన్స్‌ఫరెన్సీ గవర్నమెంట్ లీడర్షిప్ అవార్డు శ్రీకాంత్‌కు దక్కటం అభినందనీయమని అన్నారు. అవార్డును ఈ నెల 31న అందుకున్నారని, ప్రస్తుతం శ్రీకాంత్ ఎపి సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ ఎకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌ఫరెన్సీ ఎండిగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటిని నేరుగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వ్యవహరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితంగా నమ్మకంగా పనిచేస్తున్న శ్రీకాంత్‌కు అవార్డు రావటం రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌ను అభినందిస్తున్న నాయకులు

మహిళల్లో మంచి స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం మహిళల్లో మంచి స్పందన లభిస్తుందని జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళా ప్రయాణికులు జిల్లా వ్యాప్తంగా 40శాతం వరకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమల్లోకి వచ్చాక 65 శాతం వరకు ప్రతిరోజు మహిళలు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు లక్ష మంది మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ ప్రయాణాన్ని చక్కగా వినియోగించుకుంటు న్నట్లు తెలిపారు. మహిళలు ఉచితంగా ఐదు రకాల బస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ మెట్రో, సిటీ ఆర్డినరీ, అల్ట్రా పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చని అన్నారు. జిల్లాలో 253 బస్సుల్లో 212 బస్సుల్ని ఉచిత ప్రయాణానికి వినియోగిస్తున్నామని అన్నారు. 97 రూట్లలో బస్సులు తిరుగుతున్నాయని తెలిపారు. వాటిలో 80 రూట్లలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. మహిళలు ఆర్టిసి బస్సులు ప్రయాణించేందుకు ఆధార్, ఓటరు, రేషన్ ఒరిజినల్ కార్డులతో ప్రయాణం చేయాలని అన్నారు. కొంత మంది మహిళలు జిరాక్స్ కాపీలు ఫోన్లో చూపించడం, అసలు లేకుండానే ప్రయాణం కొనసాగించడం సరైంది కాదన్నారు. తప్పనిసరిగా పైన తెలిపిన ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డుతో బస్సులో ప్రయాణించే సమయంలో విధిగా ఆయా కార్డులతో ప్రయాణించవచ్చని అన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న డిపిటిఓ సామ్రాజ్యం

ప్రొఫెసర్ లాల్‌మహమ్మద్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాలలో జెనెటిక్స్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగ అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ లాల్ అహమ్మద్ మహమ్మద్‌కు ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు ప్రకటించినట్లు కళాశాల ఎడిపి ప్రసూనరాణి తెలిపారు. ఈ అవార్డును ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. బోధన, పరిశోధన, పరిపాలన విభాగాల్లో గత 19ఏళ్లుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ లాల్ అహమ్మద్ మహమ్మద్ ఇప్పటివరకు 19మంది ఎంఎస్సీ, నలుగురు పిహెచ్‌డి పరిశోధకులకు అడ్వైజరి కమిటీ సభ్యునిగా సహకరించారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి మెరిటోరియస్ టీచర్ అవార్డు పొందారని తెలిపారు. అధ్యాపకుడిగా ఆయన నైపుణ్యాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని తెలిపారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో వృత్తి శిక్షణను పొందడమే గాక అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలలో స్టడీ విజిట్ చేసిన ఘనత దక్కించుకున్నారని తెలిపారు. స్టూడెంట్ యాక్టివిటీస్ ఇన్చార్జిగా, అకాడమిక్ మ్యాటర్స్ ఇన్చార్జిగా అదనపు వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరుగా, ప్లేస్మెంట్ ఆఫీసర్‌గా, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ కోచింగ్ సెల్ ఇన్చార్జిగా పలు కీలక బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు. జాతీయ సెమినార్లను శిక్షణ నిర్వహించారని తెలిపారు. పలు వ్యవసాయ పత్రికలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించడమే గాక 200 పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలకు సమర్పించారని తెలిపారు. రైతు సేవా కార్యక్రమాలకు నిత్యం అందుబాటులో ఉండే లాల్ అహ్మద్ మహమ్మద్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రొఫెసర్ లాల్ అహ్మద్ మహమ్మద్

బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు

అందరి సహకారం అవసరం

కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో బీచ్ ఫెస్టివల్ ను రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆక్వా పరిశ్రమల యాజమాన్యాన్ని కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడానికి ఆక్వా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులతో జిల్లా కలెక్టర్ వెంకటమురళి, శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సూర్యలంక బీచ్ ను గోవాబీచ్ మాదిరిగా అభివద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. సూర్యలంకలో ఈనెల 26,27,28 తేదీలలో మూడు రోజులు పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామనిచెప్పారు. బీచ్ ఫెస్టివల్ లో పర్యాటకులకు అనుకూలంగా అన్ని హంగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బీచ్ ఫెస్టివల్ లో వాలీబాల్ పోటీలు, కబడ్డీ పోటీలను, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా సూర్యలంక బీచ్ లో రామాపురం బీచ్‌లో మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలందరూ సంతోషంగా కుటుంబ సమేతంగా బీచ్ ఫెస్టివల్ కు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. బీచ్ ఫెస్టివల్స్‌కు వచ్చే వారిని నిరాశ పరచకుండా తప్తికరంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. బాపట్లలో బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఈనెల 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తారని చెప్పారు. సూర్యలంకలో మూడు రోజులు పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి ఆక్వా పరిశ్రమ యాజమానులు, ప్రాసెసింగ్ యూనిట్ల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ బాపట్ల సూర్యలంక బీచ్ ను అభివద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.97 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటికే రూ 50 కోట్ల మేర పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి రాయల్ మెరైన్స్ సంస్థ నుంచి ఆక్వా పరిశ్రమ నుండి రూ.45 లక్షల నిధులను ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆక్వా పరిశ్రమల యజ మానులు, ప్రాసెసింగ్ పరిశ్రమల యజమా నులు బీచ్ ఫెస్టివల్స్ కు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి అధికారి ప్రభాకర్, మత్స్యశాఖ జేడీ నాయక్, జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

'గుమ్మనూరు' వ్యాఖ్యలను ఖండిస్తూ

రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అనంతపురం జిల్లా; గుత్తి ప్రాంతంలో భూసేకరణ వ్యతిరేక ఉద్యమంపై పర్యటిస్తున్న ప్రజా నాయకులను అవమానకరంగా దూషించిన గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరామ్‌పై రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం స్థానిక సాగర్ హోటల్ సెంటర్ వద్ద నిర్వహించిన నిరసనలో సంఘాల నేతలు మాట్లాడుతూ ఆయన తక్షణం ప్రజా నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదిరింపులు, బెదిరింపులతో రైతు సంఘాల నాయకులెవరూ భయపడరని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజానేతలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ ప్రజలను ఒప్పించి భూములు సేకరించాల్సిన ప్రభుత్వాలు మాఫియా గ్యాంగ్‌ను తయారు చేసి ప్రజలను భయపెట్టడం ద్వారా సేకరించాలనుకోవడం అవివేకం అని ధ్వజమెత్తారు. గుత్తి ప్రాంతంలో రైతుల భూములను సేకరించి 35 సంవత్సరాల పాటు లీజ్‌కి ఇవ్వడం సరికాదని, దానికి సంబంధించి ఏదైనా సమస్య వస్తే అక్కడ ఎవరు సమాధానం చెప్పేవారు లేరని అన్నారు. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకత్వం ఆ ప్రాంతంలో బుధవారం రోజు పర్యటించారని తెలిపారు. ఆ సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే సభ్యసమాజం తలదించుకునేలా, అసభ్యమైన భాషను ఉపయోగిస్తూ పర్యటనకు వచ్చిన నేతలు వెళ్లకపోతే దాడి చేస్తానని బెదిరించటం అమానుషమని అన్నారు. బెదిరింపులతో ఏ ఉద్యమం వెనక్కి పోదని, తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.కె.మాబు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోనే కాదు పక్కనే ఉన్న నెల్లూరు ప్రకాశం జిల్లాల మధ్య కరేడు ప్రాంతంలో 8500 ఎకరాలు మూడు పంటలు పండే భూమిని ఇండోసోల్ కంపెనీకి ఇవ్వటానికి ప్రభుత్వం పథకాన్ని రచించిందని అన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ కార్మిక, కర్షక సంఘాలు పెద్దఎత్తున పోరాడుతున్నాయని తెలిపారు. ప్రజా వ్యతిరేకతను, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా మూర్ఖంగా ముందుకు పోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రజలలో నిత్యం తిరిగే వాళ్ళు సభ్యతగా వ్యవహరిస్తారని, దాన్ని మరచి ఇష్టం ఇచ్చిన రీతిగా మాట్లాడటం శాసనసభ సభ్యత్వానికే అవమానకరమని అన్నారు. ప్రస్తుత శాసనసభలో ఉపసభాపతి, సభాపతి కూడా ఇటువంటి వ్యాఖ్యలే మాట్లాడుతున్నారని.. వారిని చూసి కింది వారు కూడా అదే బడిలో అనుసరిస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వ్యాఖ్యలు చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ భూ సేకరణ బలవంతం కాకూడదని, పంటలు పండే భూములు తీసుకోరాదని, ఒకవేళ తీసుకోవాల్సి వస్తే ప్రజలకు తగిన పరిహారం చట్ట ప్రకారం చెల్లించి తీసుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంఘాల సమాఖ్య నాయకులు జీ రమేష్, ప్రజా సంఘాల నాయకులు బెజవాడ శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారావు, కంకణాల వెంకటేశ్వర్లు, వి మోజెస్, ఉబ్బా వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, బంకా సుబ్బారావు, పూసపాటి వెంకటరావు, సిహెచ్ వినోద్, టి తిరుపతిరావు, బి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతుసంఘాల నేతలు

విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వాలు

- సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర ముగింపులో రాష్ట్ర నేత వినోద్
- సెప్టెంబర్ 6న చలో విజయవాడకు ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సంస్కరణల పేరుతో విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తూ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం చూపుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సిహెచ్ వినోద్ మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ విద్యా పరిరక్షణ సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా గురువారం నాడు సంతపేటలోని రంగా భవన్ లో ముగింపు సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సభలో వినోద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పేద విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నట్లు ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని ఎన్నికల సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యా పరిరక్షణ పేరుతో ఆగస్టు 28న గిద్దలూరులో చేపట్టిన సైకిల్ యాత్ర జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 380 కిలోమీటర్లు పర్యటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు, తల్లి దండ్రులు తమ బందానికి ఏకరవు పెట్టారని చెప్పారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు 8 రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా సాగిన సైకిల్ యాత్ర లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ విధానాల కారణంగా విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్లో మెస్ చార్జీలు పెంచకు పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కెజి నుంచి పిజి వరకు పీజీకి రీయింబర్స్‌మెంట్ కల్పిస్తానని హామీ ఇచ్చిన మంత్రి లోకేష్ నోరు విప్పడం లేదని దుయ్యబట్టారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ జిల్లాలో విద్యారంగాన్ని అభివద్ధికి చర్యలు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపించారు. జిల్లాకు ప్రకటించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటి రూపు దిద్దుకోలేదని విమర్శించారు. స్వార్థ రాజకీయాలతో 70 శాతం పూర్తయిన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం అర్ధాంతరంగా నిలుపుదల చేయడం దుర్మార్గపూరిత చర్యగా పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పలు దఫాలుగా కార్యక్రమాలకు పిలుపునివ్వగా చర్చల పేరుతో కాలయాపన చేస్తూ ఉన్నారని ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 6న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైకిల్ యాత్రలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి వీరస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే విజయ్, నాయకులు అరుణ్, ఆనంద్, సాయి, గంగాంజి, రాజశేఖర్, ఎఫ్రాయీమ్‌లను అభినందించారు. తొలుత సైకిల్ యాత్ర బందానికి సెయింట్ జేవియర్స్ స్కూల్ వద్ద ఒంగోలు నగర నాయకులు స్వాగతం పలికారు. యాత్ర కర్నూల్ రోడ్డు, అద్దంకి బస్టాండ్, పాత మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్, ఎబిఎం కాలేజీ, ప్రకాశం భవన్ వరకు సాగింది. అక్కడ రైతు సంఘం నాయకులు షేక్ మాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాలా అంజయ్య స్వాగతం పలికారు. తరువాత అంబేద్కర్ భవన్, నెల్లూరు బస్టాండ్, సంతపేట లోని రంగా భవన్‌కు చేరింది. అక్కడ సభ అనంతరం వందలాది మంది విద్యార్థులు ర్యాలీ గాప్రకాశం భవన్ కు చేరుకొని డిఆర్ఓ బి చినఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె బాబు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, సిఐటియు నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి రమేష్, టి మహేష్, బివి రావు, డివైఎఫ్ఐ నాయకులు కిరణ్, రాంబాబు, ప్రవీణ్, మోహన్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ సుధాకర్, ఎస్ వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డిఆర్ఒకు అర్జీ ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

'హర్ ఘర్ జల్' పనులు వేగవంతం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: జిల్లాకు కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన 'హర్ ఘర్ జల్ జీవన్ మిషన్' పనులను వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జల జీవన్ మిషన్ పథకం అమలు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ అనంతరాజు,డిఆర్‌డిఎ పిడి శ్రీనివాస్, డిపివో ప్రభాకర్, ఐసిడిఎస్ పిడి రాధా మాధవి, డ్వామా పిడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రజాశక్తి
ఉపాధ్యాయ దినోత్సవ
ప్రత్యేక అనుబంధం
బాపట్ల జిల్లా 8 పేజీలు శుక్రవారం 5 సెప్టెంబర్, 2025 Advt feature

స్టార్ రేటింగ్ పొందేలా..

పాఠశాలల బలోపేతం

- ఉత్తమ విద్యా ఫలితాల సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి
- బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం

జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్టార్ రేటింగ్ పొందేలా జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, అన్ని అంశాల్లో బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వ పాఠ శాలల ద్వారా అత్యుత్తమమైన విద్యాబోధన చేపట్టడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించటమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ పురుషోత్తం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందించడానికి తగిన కృషి జరుగుతోంది. బాపట్ల జిల్లాలో పాఠశాలల్లో నాణ్యమైన విద్యాభోదన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-2026 సంవత్సరం నుండి పాఠశాలలను పునర్వ్యవస్థీకరణ చేయడం జరిగింది. ఈ మేరకు జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 6 రకాల పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలు వచ్చాయి. ఎల్‌కేజీ, యూకేజీ బడులను శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు తరగతులు కలిపి ఫౌండేషనల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేశారు. ఇవి జిల్లాలో 112 ఉన్నాయి. 1, 2 తరగతులతో పాటు 1 నుంచి 5 తరగతులు ఉండే వాటిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేయగా జిల్లాలో ఇవి జిల్లాలో 757 ఉన్నాయి. 1 నుంచి 5 తరగతులు ఉండి, 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్చారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 47.ఉన్నత పాఠశాలలు 189 మొత్తంగా జిల్లాలో 1,315 పాఠశాలలు ఉన్నట్లు డిఇవో తెలిపారు.

జిల్లాలో 45 కు మించి విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని నియమించారు. సదరు పాఠశాలలో 120కి మించి విద్యార్థులుంటే మరో ఉపాధ్యాయుడుని నియమిస్తున్నారు. అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహారీ, ఆటస్థలం ఉండేలా చూస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,122 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండగా వీటిలో 233 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలలను అన్నీ విధాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక పాఠశాలలను పెంచాలనే దిశగా కృషి చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఈ విద్యాసంవత్సర ప్రారంభంలోనే ఉపాధ్యాయుల బదిలీల పనులు పూర్తి చేశారు.ఈ ఏడాది చేపట్టిన డిఎస్‌సి ద్వారా జిల్లాకు అదనంగా ▶ 8లో

గురువు స్థానం పదిలమేనా?

TEACHER'S DAY

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. ఒకప్పుడు నల్లబోర్డుపై బోధన చేసే చోటనే ఇప్పుడు డిజిటల్ తెరపై పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా గురువులు పాఠాలు చెబుతున్నారు. బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు మాత్రమే కాకుండా సమాజంలో మాస్టార్లు ప్రధాన భూమిక పోషించేవారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానాల్లో, సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుల పాత్ర ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పుడు సమాజంలో ఉపాధ్యాయుడి స్థానం ఏమిటి? అతడికి ఏ హోదా లభించాలి ? దేశాల మధ్య ఎంత భిన్నత్వం వున్నప్పటికీ గురువుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వాల వద్ద ఏ ఉమ్మడి ప్రణాళికలు ఉండాలి? ఏ ప్రమాణాలు పాటించాలి? ఎలాంటి విధానాలు ఉండాలి ? వీటన్నింటిపై సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. ▶ 2లో

గురువు స్థానం పదిలమేనా?

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

కాలం ప్రవాహం లాంటిది. మానవ అవసరాలూ, సంబంధాలూ ఆ ప్రవాహంలో నిరంతరం మారుతుంటాయి. వాటికి తగ్గ విలువలూ ఏర్పడి, సమాజపు అన్నిపొరల్లోకి విస్తరిస్తూ వుంటాయి. విద్యారంగమేమీ దీనికి మినహాయింపు కాదు.

హోదాపై యునెస్కో పత్రం

వీటిపై ఐక్యరాజ్యసమితి విద్యా శాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1966 అక్టోబర్‌లో ఆమోదించిన పత్రం ఆనాటి కంటే ఇప్పుడు మరీ విలువైంది. యునెస్కో చాలా స్పష్టంగా గురువుల హోదా 'విద్యను పిల్లల ప్రాథమిక మానవహక్కుగా ప్రభుత్వాలు గుర్తించడంపై ఆధారపడి వుంది' అని మొదటి వాక్యంలోనే చెప్పింది .మానవాభివృద్ధి ఆధునిక సమాజంలో అన్నిటికంటే విలువైందని ప్రభుత్వాలు గుర్తిస్తే దానికి ప్రధాన సూత్రధారులైన ఉపాధ్యాయులకు న్యాయమైన హోదా సహజంగానే లభించి తీరుతుందని దాని సారాంశం. మరో మాటలో చెప్పాలంటే ప్రభుత్వం విద్యకిచ్చే ప్రాధాన్యతపై గురువుల గౌరవం ఆధారపడి వుంటుంది.

మరి ఆ విద్య ఎలాంటిదై వుండాలి?

అది మానవుడి సంపూర్ణ అభివృద్ధికి మార్గదర్శకంగా వుండాలి. దీన్ని సైతం యునెస్కో ప్రముఖంగా పేర్కొంది. అలాంటి విద్యకు పెద్ద పీట వున్నచోట గురువులు కూడా గొప్ప గురువులే అయి వుంటారు. సామాజిక చైతన్యం, నైతికత, సాంస్కృతిక వికాసం, మానవ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమున్నత సమాజ నిర్మాణం మన చదువులకు పరమలక్ష్యంగా వున్నప్పుడు ఉపాధ్యాయులు కూడా దీనికి తగ్గ ప్రమాణాలతోనే వుంటారు. వారి వృత్తి పట్ల ప్రజల్లో అపార గౌరవం వుంటుంది. వారి హోదాకు సమాజమే రక్షణ కవచమవుతుంది.

ఇలాంటి ఉపాధ్యాయులకు సంఘాలు పెట్టుకునే హక్కు, తమ హక్కుల్ని కాపాడుకునేందుకు ఉమ్మడి బేరసారాలు చేసే హక్కు కూడా వుండి తీరాలి. వారికి సమానమైన వేతనాలు లభించాలి. ఎలాంటి వివక్షతో వారిని చూడరాదు. ఇవన్నీ 1948–1960 ల మధ్య అంతర్జాతీయంగా జరిగిన పలు చర్చల్లో ఆమోదించిన అంశాలు. వాటినన్నింటిని యునెస్కో తనపత్రంలో పునరుద్ఘాటించింది. విద్యావ్యాప్తిలో ముఖ్యపాత్ర పోషించే శక్తులుగా ఉపాధ్యాయ సంఘాలను గుర్తించాలని పేర్కొంది. విధాననిర్ణయాలన్నిటిలో వీటిని భాగస్వాముల్ని చేయాలని పేర్కొంది. ఈ సదస్సుకు 75 దేశాలు హాజరయ్యాయి. అందులో మన దేశమూ వుంది.

మారుతున్న ప్రపంచం..

ఇదంతా పాత సంగతి. అరవై ఏళ్ల నాటి సంగతి. ప్రపంచం ఈ తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగమించింది. దేశాల ఎల్లలు క్రమంగా చెరిగిపోతున్నాయి. ప్రజాస్వామిక విలువలపై ఎప్పుడూ జరగనంత చర్చ జరుగుతున్న కాలమిది. మానవ హక్కులకు ఎక్కడ భంగం కలిగినా భూగోళమంతా నిరసన ధ్వనులు వినిపిస్తున్న రోజులివి. అన్నిటికంటే మించి ఆర్థికాభివృద్ధికి మానవాభివృద్ధిని ఇరుసుగా అటు అర్థశాస్త్రవేత్తలు, ఇటు సామాజిక శాస్త్రవేత్తలు మొత్తం ముక్త కంఠంలో వర్ణిస్తున్న యుగంలో మనమున్నాం. ఆధునిక సమాజం ఇప్పుడు విద్యకిస్తున్న ప్రాధాన్యతను మనమెప్పుడూ ఎరగం. దీనితో పాటు నూతన శాస్త్రాలు, అన్వేషణలు, వాస్తవాలు, నిరూపణలు, తాత్వికతలు కూడా మన విద్యారంగాన్ని విప్లవాత్మకంగా మార్చేస్తున్నాయి. న్యాయంగా అయితే మన చదువులు వీటివల్ల ఒక మహోన్నత విశ్వమానవ సమాజానికి బాటలు వేసేవిగా రూపాంతరం చెంది వుండాలి.

మారిపోయిన విద్యా నిర్వచనం..

కానీ నిజంగా విద్యారంగంలో జరుగుతున్నదేమిటి? దీంతో ఉపాధ్యాయుడి హోదా ఏ రూపంలోకి మారుతోంది? అన్నిటికంటే పెద్ద సమస్య ఏమంటే మన విద్యకు నిర్వచనం మారిపోయింది. బతుకుతెరువు కోసం కొన్ని నైపుణ్యాల్ని అందించడం, పోటీ పరీక్షల కోసం కొన్ని మెళకువలను నేర్పించడం, మెదడు నిండా వీలున్నంత సమాచారాన్ని దట్టించడం ప్రస్తుతం చదువుగా దఖలు పడిపోయింది. దీంతో గురువుకి కూడా పిల్లల్ని పరీక్షల్లో గట్టెక్కించడం పరామావధిగా మారిపోయింది. అతని ప్రమాణాలకు ఇదే కొలబద్ద అయిపోయింది.

ఓ ఐదారు దశాబ్దాలకు ముందు "విద్య" అనగానే కొన్ని పదాలు దానికి తప్పనిసరిగా తోడుండేవి. స్వేచ్ఛ, ప్రజాస్వామిక, విమర్శనాత్మక, సృజనాత్మక, విముక్తిదాయక, మానవీయ, సజీవ లాంటి విశేషణాల నుంచి అది విడదీయలేనిదిగా వుండేది. ఎందరు విద్యాతాత్వికులు వీటి చుట్టూ ఎన్ని చర్చోపచర్చలు చేశారో, ఎన్ని ప్రయోగాలు జరిపారో, ఎంతగా జీవితాల్ని అంకితం చేశారో చెప్పలేము. వీరందరినీ మనం గొప్ప గురువులన్నాం. వారి నిర్ధారణలకు, ప్రయోగాలకు మన విద్యా విధానాల్లో, పాఠ్య ప్రణాళికల్లో గొప్ప స్థానం వుండేది. సమాజపు భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని గొప్పగా చెప్పుకునే వాళ్ళం. దీనికి తగినట్టు గురువును సమున్నత స్థానంలో ప్రతిష్టించుకున్నాం.

బీటలు వారుతున్న స్థానం..

ప్రపంచీకరణ యుగంలో ఇవన్నీ తల్లకిందులైపోయాయి. సమాజంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. సరుకు అనగానే మార్కెట్, వ్యాపారం ముందుకొచ్చి మిగతా విలువలన్నీ వెనక్కి పోతున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయుడి హోదాని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. అతడికిప్పుడు తరగతి గదిలో స్వేచ్ఛ లేదు. పాఠ్యాంశాల రూపకల్పనలో స్థానం లేదు. విద్యావిధానాల్లో ప్రమేయం లేదు. అతని అనుభవాలకు ఏ విలువా లేదు. అన్నిటికంటే ఘోరం అతనికి, విద్యార్థికి మధ్య ఆత్మీయ స్పర్శ లేదు. ఒక సజీవ సంభాషణ లేదు. స్నేహమయ ప్రపంచం లేదు. దీనివల్ల విద్యార్థి ఎంత పోగొట్టుకుంటున్నాడో గురువు కూడా అంతే పోగొట్టుకుంటున్నాడు. పిల్లలెంత నిర్గుణ నిర్వికారులుగా మారుతున్నారో.. ఉపాధ్యాయులూ అలానే అవుతున్నారు. ఒక దశ దాటేప్పటికి మన గురువులు ఏదో పోగొట్టుకున్నామనీ, తమ గురువు స్థానం బీటలు వారిందని గుర్తించే స్పృహను కూడా కోల్పోతున్నారు. మౌనంగా ఒక చట్రంలోకి ఇమిడిపోతున్నారు. ఇంతకన్నా వారికి జరిగే నష్టం ఏముంటుంది?

హరించుకుపోతున్న హక్కులు..

కార్మిక చట్టాల్లో మార్పులు, ప్రజాస్వామిక ఉద్యమాల అణచివేత, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ప్రవేశం లాంటివి ఒకదానికొకటి తోడై ఉపాధ్యాయ సంఘాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న పెన్షన్ లాంటి హక్కులన్నీ ఒక్కొక్కటీ హరించుకుపోతున్నాయి. సంఘాలకు గుర్తింపు, గౌరవం, విధానాల్లో భాగస్వామ్యం, వాటితో నిరంతర ప్రజాస్వామ్య సంబంధాలు దాదాపు అడుగంటుతున్నాయి. ఎంతో సైద్ధాంతిక నేపథ్యం, చారిత్రక వారసత్వం, సంఘటిత శక్తి, నిర్మాణం గల సంఘాలు కూడా ఎదురీదే పరిస్థితి ఏర్పడుతోంది.

ఒంటరి వాళ్లవుతున్న టీచర్లు..

ఇవన్నీ ఒక ఎత్తు.. టీచర్లు సమాజానికి నానాటికీ దూరమైపోడం మరో ఎత్తు. మానవ సంబంధాలన్నీ తారుమారవుతున్న కాలం మనది. తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఏ స్నేహ సంబంధాలు లేని విద్యారంగం అంతిమంగా టీచర్లని కూడా ఒంటరి వాళ్లను చేస్తుంది. వారికి సమాజపు మద్దతు కరువయ్యేలా చేస్తుంది. బడి బరువంతా గురువులే మొయ్యాల్సిన స్థితి ఏర్పడుతుంది. దీంతో టీచర్లు ప్రతిదానికీ దోషులుగా నిలబడాల్సి వస్తుంది. వారి హోదా మరీ సన్నగిల్లి పోవడానికిది దారితీస్తుంది. ఇలాంటి పరిణామాల పట్ల ఉపాధ్యాయ వర్గం అప్రమత్తం కావాలి. వీటికి మూలాలు ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. తమనొక్కరినే ఈ ఉపద్రవం చుట్టుముట్టడం లేదనీ, మొత్తం సమాజాన్నీ ఇది ఆవహించిందనీ అర్థం గుర్తెరగాలి.

గురువు ధర్మం గుర్తుంచుకోవాలి

ఉన్నంతలోనైనా తమ స్థానం పదిలంగా వుండాలంటే ఘర్షణ పడక తప్పదు. ఒకవైపు తన స్థాయిని, వృత్తి ప్రమాణాల్ని ఆధునిక సామాజిక అవసరాలకు తగినట్లు పెంచుకుంటూ ఎదురీడం నేర్చుకోవాలి. పిల్లల మనసుల్ని గెలుచుకొని, సమాజానికి సన్నిహితం కావాలి. సుదీర్ఘ మానవ చరిత్ర ఎన్ని మలుపులు తిరిగిందో గురువులకు మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. ఆ మలుపుల్ని ఏ శక్తులు ఎలా మలుచుకున్నాయో, అప్పుడు ఏ సవాళ్లు ఎదురయ్యాయో, ఏ ఘర్షణలు జరిగాయో, వీటిలో ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో ఉపాధ్యాయులకు వివరించి చెప్పాల్సిన పనిలేదు. ఈ మలుపులన్నింటా గొప్ప గురువులు ఏ పాత్రను పోషించారో, ఎన్ని కష్టాల్ని కొనితెచ్చుకొని తమ గురు స్థానాన్ని భద్రం చేసుకున్నారో వారికి బోధించాల్సిన అవసరం అంతకన్నా లేదు.

గురువులు స్వాధ్యాయం (ప్రపంచాన్ని తెలుసుకోవడం) నుంచి దూరం కానంతకాలం, ప్రవచనం (బాధ్యతగా బోధించడం) నుంచి పలుచబడనంతకాలం వారి స్థానం పదిలంగానే వుంటుంది. కాకుంటే కాల పరీక్షకు తట్టుకోవాలి. "తాము గురువులం సుమా!" అని అనుక్షణం గుర్తుంచుకోవాలి. విశాల ప్రపంచంలోని విమోచనా శక్తులన్నిటితో మమైకం కావాలి.

చదువుల్లో అంతరాలు- గురువుల్లో అంతరాలు

మనం విశ్వగురువులమనీ, మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నామని ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో సింహభాగం మనవాళ్లే! కనీసం సగానికి సగం మందికి అక్షర జ్ఞానం అందివ్వడమే గగనంగా వున్న చదువులు మనవి. మన సామాజిక ఆర్థిక అంతరాల్నీ, అసమానతల్నీ మన విద్య మరింత స్థిరపరుస్తోంది. అందరు పిల్లలు కలిసి ఒకే చోట, ఒకే చదువు చదువుకునే కామన్ స్కూల్ అంటూ మనకు లేదు . "ఎంత ఆర్థిక స్తోమత వుంటే అంత మంచి చదువు" అనే విద్యానీతి మనది. ఈ అంతరాలు సహజంగానే ఉపాధ్యాయుల్లో కూడా ప్రతిఫలిస్తున్నాయి. ఒకటే చదువు చెబుతున్న ప్రభుత్వ, ప్రైవేటు టీచర్ల వేతనాల మధ్య పోలికే లేదు. వారిద్దరి స్వేచ్ఛా స్వాతంత్రాలు, సామాజిక హోదా ఏమాత్రం ఒకటి కావు. యునెస్కో ఏ అంతరాలు టీచర్ల మధ్య వుండరాదని అరవై ఏళ్ల ముందు చెప్పిందో అవి అప్పటికీ ఇప్పటికీ ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి తప్ప తగ్గలేదు. టీచరు మార్కెట్లోకి వచ్చి సరుకుగా నిలబడ్డాక అతన్ని బజారులో నిలబెట్టి వేలం వెయ్యడంలో వైపరీత్యం ఏముంటుంది? క్రమంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలు తగ్గుతున్నారు. ప్రైవేట్‌లో పెరుగుతున్నారు. ఈ మధ్య ఇది మరీ వేగం పుంజుకుంది. దీన్ని సాకుగా చూపి మొత్తం వ్యవస్థనే ప్రభుత్వాలు కుదిస్తున్నాయి. దీంతో మంచి వేతనాలు, పని సౌకర్యాలు గల ఉపాధ్యాయ వర్గం బాగా తగ్గిపోతోంది. బతకలేని బడిపంతుళ్ళు మళ్ళీ పెరిగిపోతున్నారు.

సాంకేతికత.. కొత్త ధోరణులు..

విద్యా రంగంలోకి జొరబడ్డ సాంకేతిక విప్లవం కూడా ఈ మధ్య కొత్త ధోరణులకు తెర తీస్తోంది. క్రమంగా ఇది ఉపాధ్యాయుడిని పక్కకు నెట్టి యాంత్రిక విద్యను తరగతి గదిలో ప్రతిష్టిస్తోంది. న్యాయంగా అయితే ఈ సాంకేతికత మన చదువుల్ని సరళతరం చేసి వుండాలి. ఉపాధ్యాయుడిని మరింత శక్తిమంతుడిని చేసి, పిల్లలకు సన్నిహితుడిని చేసి వుండాలి. దీనికి బదులు గురుశిష్యుల మధ్య ఇది అడ్డుగోడగా నిలబడుతోంది. కృత్రిమ మేధ కూడా తోడైతే అది మొత్తంగానే మన చదువుల్ని ఏ తీరాలకు చేరుస్తుందో చూడాల్సి వుంది. అప్పుడు గురువు స్థానం పెద్ద ప్రశ్నార్థకం అవుతుందేమోనని భయమేస్తోంది.

- విఠపు బాల సుబ్రహ్మణ్యం
విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు..

అక్షర దీపాలతో విజ్ఞాన జ్యోతులు వెలిగించి..
విచక్షణ సంస్కారంతో సమాజం పట్ల బాధ్యత కలిగించి..
మా భవిష్యత్తు కోసం బలమైన పునాదులు వేసి..
బడిని, బాధ్యత ను భవిష్యత్తు ను పరిచయం చేసిన
మా గురువర్యులను స్మరించు కుంటూ..
సమాజ నిర్దేశితు లైన ఉపాధ్యాయులకు
టీచర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు.

ఎం. పట్టాభిరామయ్య,ఎస్.ఐ
సంతమాగులూరు పోలీస్ స్టేషన్, బాపట్ల జిల్లా.



తరగతి గది ఒక ప్రసూతి గది...
జ్ఞానానికి జన్మనిచ్చేందుకు
తరగతి గది ఒక శ్మశాన వాటిక...
అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు
తరగతి గది
ఒక కర్మాగారం...
జాతి భవితను నిర్మించేందుకు...
తరగతి గది ఒక న్యాయస్థానం...
సరైన నిర్ణయాలు
తీసుకునేందుకు..

- డాక్టర్ సర్వేపల్లి

Train up a Child in the way he Should Go - Proverbs 22:6

OXFORD
ENGLISH MEDIUM HIGH SCHOOL
(RECOGNISED BY GOVT .OF. AP)
Edupalli Village,Nagaram Mandal,Bapatla District - 522268.

Good Academic Planning & Readiness
Students Friendly Ambience
Prime Focus On NEET/IIT/JEE Foundation
Introducing AI ,CODING AND ROBOTIC for PRIMARY STUDENTS
CAMBRIDGE Syllabi For 1st TO 5th Class
Study Hours and Home Work Help
Aerobics, Sports and Games.
BUS and Van Facility
ADMISSIONS OPEN NURSERY to 10th
CONTACT 9392574727, 9908162272.

"TEACHING IS A PROFESSION THAT CREATES ALL OTHER PROFESSIONS"...'
CONGRATULATIONS PRATIBHA PURSKAR AWARD WINNERS ..

P.GEETHIKA 589/600
K.JAYALAHSMI 583/600

ప్రతి విద్యా సంవత్సరంలో IIT,SIMO,SISO,OLYMPAIDS, చెకుముకి వంటి పోటీ పరీక్షలలో ఘన విజయం సాధించిన మా విద్యార్థులందరికి మా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము .

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

అందరూ చదవాలి ..అందరూ ఎదగాలి..
ఉన్నతమైన సమాజానికి పాటుపడే విధంగా
విద్యాబోధన గావిస్తున్న ఉపాధ్యాయులకు
టీచర్స్ డే శుభాకాంక్షలతో..

బాదావత్ సాంబయ్య నాయక్
యుటిఎఫ్ నాయకులు
చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

కర్లపాలెం మండల పరిధిలోని
ఉపాధ్యాయుని,
ఉపాధ్యాయ మిత్రులందరికీ
గురుపూజోత్సవ శుభాకాంక్షలు....

UTF

యుటిఎఫ్ మండల శాఖ
కర్లపాలెం

కర్లపాలెం మండలం, బాపట్ల జిల్లా

శుభాకాంక్షలతో.

APTF

ఎస్.టి.యు మండల శాఖ
భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా...
ఉపాధ్యాయ మిత్రులందరికీ. మా హృదయపూర్వక శుభాకాంక్షలు...

జొన్నాదుల సురేష్
అధ్యక్షులు

మొర్ల వెంకటేశ్వరరావు
ప్రధాన కార్యదర్శి

ఎండి ఆసిఫ్ అలీ
జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

మరియు కార్యవర్గ సభ్యులు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో.....

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో అహర్నిశలు కృషి చేస్తూ..
విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

UTF

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్
బాపట్ల జిల్లా శాఖ..

జె. వినయ్ కుమార్,
యుటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు, బాపట్ల , బాపట్ల జిల్లా.

అడుగుల శ్రీనివాసరావు,
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బాపట్ల, బాపట్ల జిల్లా.

టీచర్స్‌డే శుభాకాంక్షలు

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి నిరంతర కృషి చేస్తున్న
ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు .
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకుందాం...
ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకుందాం ..

బేతాళ సాల్మన్ రాజు
ప్రధానోపాధ్యాయులు
NR & PM ఉన్నత పాఠశాల
చీరాల,బాపట్ల జిల్లా

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

చెరుకుపల్లి మండల పరిధిలోని. ఉపాధ్యాయ
మిత్రులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు....

కాటూరు నాగేశ్వరరావు
అధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక
చెరకు పల్లి మండల శాఖ

శ్రీ కుంచా వెంకట రామ్మోహన్
ప్రధాన కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక
చెరుకుపల్లి మండల శాఖ

డాక్టర్ ఇంకొల్లు రంగారావు గారు,
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
మరియు గౌరవాధ్యక్షులు, బాపట్ల జిల్లా జనవిజ్ఞాన వేదిక

జన విజ్ఞాన వేదిక
చెరుకుపల్లి మండల శాఖ - బాపట్ల జిల్లా

ఆంధ్రప్రదేశ్ విద్యారంగం - మార్పుల ఆవశ్యకత

ఆధునిక రాజ్యంలో అందరికీ విద్య, నాణ్యమైన విద్య, సమానమైన విద్య కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. విద్య, అక్షరాస్యతల ద్వారానే ప్రజలకు సాధికారత, అభివృద్ధి ఫలితాలను అందుకునే స్థాయి లభిస్తుంది. భారత రాజ్యాంగంలో 45వ నిబంధన 14 సంవత్సరాలలోపు బాలబాలికలందరికీ ఉచిత నిర్భంధ విద్య కల్పించాలని పేర్కొన్నది. కానీ గత 7 దశాబ్ధాలలో రాజ్యాంగం అశించిన లక్ష్యాలు నెరవేరలేదు. సార్వత్రిక ప్రాధమిక విద్య లక్ష్యం ఆచరణలో విఫలమైనది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అక్షరాస్యత జాతీయ సగటు 74శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 67శాతం మాత్రమే ఉన్నది. ఎపిలో మహిళా అక్ష్యరాస్యత 60శాతం ఉన్నది. శ్రీకాకుళం 61, విజయనగరం 58, ప్రకాశం 63, కర్నూలు 60, అనంతపురం 63 శాతంతో అక్షరాస్యతలో రాష్ట్ర సగటుకంటే తక్కువగా ఉన్నాయి. ప్రజల ఆర్థిక, సామాజిక స్థాయి పెంచాలంటే అక్షరాస్యత పెంపుదలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.



ఆంధ్రప్రదేశ్ విద్యారంగ కార్పొరేటీకరణ

1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం పెద్ద ఎత్తున కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం 61వేల పాఠశాలల్లో 72లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. లక్షా80వేల మంది ఉపాధ్యాయులు ప్రభుత్వరంగంలో, లక్షమంది ఉపాధ్యాయలు ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులు తక్కువ వేతనంతో పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వీరిని సంఘటితం చేయాల్సిన అవసరం ఉన్నది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరాలనికి 20వేలు కోట్ల విద్యావ్యాపారం చేస్తున్నాయి. విద్యారంగంలో రెండు సమాంతర వ్యవస్థలు కొనసాగుతున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు డేస్కాలర్స్‌కు 25వేల నుండి లక్ష రూపాయల వరకు, హాస్టల్లో లక్ష నుండి 3లక్షలవరకు ఉంటున్నాయి. అనేకమంది కార్మికులు, రైతులు పిల్లల చదువు కోసం అప్పులపాలవుతున్నారు. అసంఘటితరంగ కార్మికులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడానికి ప్రయత్నించడం లేదు. విద్య లక్ష్యమైన సృజనాత్మకత, వికాసం, సహజ సామర్థ్యాలు పెంచడం మరుగున పడిపోయి ఒత్తిడి, బట్టీలు, మార్కులు, గ్రేడులు ప్రధాన అంశాలుగా మారాయి. ఒత్తిడి భరించలేక అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం సర్వసాధారణమైన అంశంగా మారింది. ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించాల్సిన అవసరమున్నది.

జాతీయ విద్యాహక్కు చట్టం -బాలకార్మికులు

2002లో 86వ రాజ్యాంగ సవర ణ ద్వారా రాజ్యాంగంలోని 21-ఎ నిబంధన చేర్చి ప్రాధమిక విద్యను ప్రాధమిక హక్కుగా మార్చారు. దీనికనుగుణంగా 2009లో జాతీయ విద్యాహక్కు చట్టం రూపొందించి, 2010 ఎప్రిల్ 1నుండి అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం 6-14 సంవత్సరాలు గల పిల్లలందరూ బడిలో ఉండాలి. గత 8 ఏళ్లలో ఈ చట్టం అమల్లో తీవ్ర వైఫల్యం కనబడుతున్నది. ఈ నాటికీ దేశంలో 6కోట్ల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 15లక్షలమంది పిల్లలు బడికి వెళ్లకుండా బాల కార్మికులుగా ఉన్నారు. క్వారీలు, హోటల్స్, ఆటోమెబైల్స్, నాపరాళ్ల పరిశ్రమ మొదలగుచోట్ల పెద్ద సంఖ్యలో బాల కార్మికులు పనిచేస్తున్నారు. జాతీయ విద్యాహక్కు చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చు.

జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం సీట్లను బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాలి. వీరి ఫీజులను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు చెల్లిస్తుంది. ఈ నిబంధనను ఇంతవరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయకపోవడం దారుణం. అనేకమంది పేదలు, అసంఘటిక రంగ కార్మికుల పిల్లలు లబ్ధిపొందడానికి ఈ నిబంధన తోడ్పడుతుంది.

కెఎస్ లక్ష్మణరావు
మాజీ శాసనమండలి సభ్యులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో

విద్యార్థులందరికీ ఉచిత సైకిల్

సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అద్దంకి నియోజకవర్గంలోని ప్రతి ఉన్నత పాఠశాల విద్యార్థికి ఉచితంగా సైకిల్ అందించే దిశగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషి చేస్తున్నారు. రెండు దశాబ్దాలకు పైగా తనను ఆదరిస్తూ వస్తున్న అద్దంకి నియోజకవర్గంలోని ప్రజానీకానికి అన్ని విధాలుగా తన సహాయ సహకారాలు అందిస్తున్న మంత్రి గొట్టిపాటి తన నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన సొంత నిధులు, అసిస్ట్, మేఘా సంస్థలు, మిత్రుల చేయూతతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 3 వేలకు పైగా సైకిళ్ళను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు, కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించేలా మంత్రి చర్యలు తీసుకున్నారు. పాఠశాలలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం సైకిళ్ళు అందజేయాలని నిర్ణయించుకున్న మంత్రి గొట్టిపాటి తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శిస్తూ అక్కడ చదువుతున్న అందరు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు అందిస్తున్నారు. దీంతో తాము సకాలంలో పాఠశాలకు వెళ్ళగలుగుతున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో అద్దంకి నియోజకవర్గంలోని ప్రతి ఉన్నత పాఠశాల విద్యార్థికి ఉచితంగా సైకిల్ అందించనున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

బాలికా విద్య చైతన్య పతాక సావిత్రిబాయి పూలే



మన దేశపు తొలి ఉపాధ్యాయురాలిగా, సామాజిక విప్లవకారిణిగా చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాందించుకున్న మహోన్నత మహిళ, రచయిత సంఘసంస్కర్త సావిత్రీ బాయి పూలే. మహాత్మజ్యోతిరావు పూలే భార్యగానే అందరికీ తెలుసు. కాని తనొక మహిళా ఉద్యమ గొంతుక, బాలికా విద్య చైతన్య పతాక అన్న సంగతి కొందరికే తెలుసు. మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకా నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న రైతుదంపతులైన ఖండోజి నవ్‌సే పాటిల్, లక్ష్మీబాయి దంపతులకు జన్మించిన ఈ మహిళ గురజాడ చెప్పినట్లు ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందన్న మాటల్ని నిజం చేసింది. చరిత్రనే తిరగరాసింది. బ్రాహ్మణ ఆధిపత్యం కొనసాగుతున్న ఆ కాలంలో సంఘసంస్కరణ ఉద్యమానికి బాటలు వేసింది. ఆనాటి దురాచారాల్లో భాగంగా తొమ్మిదేళ్ళ వయస్సులోనే పన్నెండేళ్ళ మహాత్మ జ్యోతిరావును వివాహమాడింది సావిత్రిబాయి. భర్త మహాత్మ జ్యోతిరావు పూలే సహకారంతో చదువుకుని, తన మాదిరి మహిళలందరూ చదువుకుంటే సమాజం వేగవంతమవుతుందని, దురాచారాల్ని, మూఢ నమ్మకాల్ని అసమానతల్ని రూపుమాపొచ్చని భావించి 1848 మే 12న బహుజనుల కోసం పూనేలోని బుధవార్‌పేట్‌లో మొదటపాఠశాలను ప్రారంభించింది. దేశంలోనే మొదటి ఉపాధ్యాయు రాలుగా చరిత్రలో స్థానం సంపాందించుకుంది. ఛాందసవాదులు ఆమెపై దాడులు చేసినా భయపడలేదు. నాలుగేళ్ళలో 20 పాఠశాలలు ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. అశ్పృశ్యులకోసం మంచినీటి బావిని తవ్వించింది. అశ్పృశ్యుల విద్య కోసం అహిల్యాశ్రమ్ అనే పాఠశాలను ప్రారంభించింది. 1849లో పూలే దంపతులను సంఘ బహిష్కరణ చేశారు. వారు భయపడలేదు. రెట్టించిన ఉత్సాహంతో తమ సామాజిక కార్యక్రమాలు ఆపలేదు. 1852లో మహిళా సేవా మండల్‌ను స్థాపించి మానవ హక్కులు సామాజిక సమస్యల గూర్చి చర్చించి, జెండర్ అసమానతలపై మహిళలలను చైతన్య పరిచారు. స్త్రీ జాతికి వెలుగు దివ్వెగా నిలచిన సావిత్రీబాయి స్త్రీజాతికే కాక యావత్తు దేశానికే గర్వకారణం అనవచ్చు. కులవ్యతిరేక ఉద్యమాల్లో, స్త్రీ హక్కుల పోరాటంలోనూ సావిత్రీబాయి ఎనలేని పోరాటం చేశారు. సమాజ సేవ ఒక పక్క, ఉపాధ్యాయినిగా మరో పక్క పని చేస్తూనే తన కలానికి పదను పెట్టి కవిత్వాన్ని రాశారు. 1854లో కావ్యపూలే కవితా సంపుటిని తీసుకొచ్చారు. 1860లో వితతంతువులకు శిరోముండనం చేయవద్దని క్షురకులను చైతన్య పరిచి వారితో ఉద్యమం చేయించి విజయం సాధించారు. 1868లో అంటరానితనం వ్యతిరేకంగా పోరాడారు. 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి ఆ సంస్థ ద్వారా బాల్య వివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలన కోసం, సతీసహగమనం రూపుమాపేందుకు వితంతు పునర్వివాహం కోసం శ్రమించారు. 1873 డిసెంబర్ 25న భార్యను కోల్పోయిన ఒకయువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో వివాహం జరిపించారు. బ్రాహ్మణ విధవరాలి కుమారుడిని దత్తతకు తీసుకొని యశ్వంత్‌గా నామకరణం చేసి వారి ఆశలకు ఆశయాలకు అనుగుణంగా పెంచారు. సామాజిక విప్లవోద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని స్త్రీ విద్య కోసం నిరంతరం కృషి చేసిన మహావ్యక్తి సావిత్రి బాయిపూలే. 1897లో మహారాష్ట్రలో ప్లేగు వ్యాధిరావడంతో తన కుమారుడితో కలసి చికిత్సకు నడుంబిగించారు. ఈ క్రమంలోనే 1897 మార్చి 10న ప్లేగు వ్యాధితో సావిత్రి బాయి మరణించారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రీబాయి స్మృత్యర్థం తపాల స్టాంపును విడుదల చేసింది. ఇటీవల పూనే విశ్వవిద్యాలయానికి సావిత్రీ బాయి విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని మహిళల్ని సమాయత్త పరిచి, వారికి విద్యాబుద్ధులు నేర్పించి సంఘసంస్కరణ ఉద్యమాల్లో పాల్గొనేలా సావిత్రిబాయి కృషి చేశారు. మనుషుల్ని, సమాజాన్ని వ్యవస్థను మార్చడం మామూలు విషయంగా భావించలేము. ఈ నాటికి మహిళలుగా పోరాడుతూనే ఉన్నారు. ఇంకా పోరాడాల్సి ఉందని ప్రస్తుత పరిస్థితులిన్న చూస్తే అర్థమవుతోంది. సావిత్రిబాయి పూలే అందించిన ఉద్యమస్ఫూర్తి, రగిలించిన చైతన్యం ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలి. అసమానతల సమాజం అంతమయ్యే వరకూ పోరాడాలి. మహిళా మార్గదర్శి, జాతి స్థితిగతుల్నే మార్చిన మహెూన్నత రచయిత్రి సావిత్రిబాయి కలలు కన్న సమాజం ఆదర్శవంతమైన సమాజం. ఏ మహిళా సమస్యలు ఎదుర్కొకోకూడదని, సంఘంలో గౌరవం కోల్పోకూడదని నిరంతరం తపించారు. మూఢాచారాలు, దురాచారాలు సంఘంలో అంతర్భాగమైన కాలంలో ఒక అలలా, ఉప్పెనలా ఎగసి పడి సామాజిక రుగ్మతల అంతమే పంతంగా కలంతో గళంతో పోరాటం చేసిన రచయిత్రి సావిత్రిబాయిపూలే. ఆమె ఆశయాలు ఇంకా మిగిలిపోయాయి. అవి నెరవేర్చేందుకు ప్రతి మహిళా కృషి చేయాలి.

మూడు దశాబ్దాలుగా విద్యా రంగాన..

తిరుగులేని పురోగతి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఏవీవీ పాఠశాలలో ఒకప్పటి విద్యార్థి అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న యడ్ల సత్యవతి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు-2025 అవార్డును అందుకోవడం పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. 1913లో బాపట్ల పట్టణంలో అన్నవరపు విద్యాభివర్ధని (ఏవీవీ) పాఠశాలను అన్నవరపు పుండరీకాక్షుడు ఆధ్వర్యంలో స్థాపించారు. బాలికల విద్య కోసం మొట్టమొదటిసారిగా బాపట్లలో ఏర్పాటు చేసిన పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత, తాజాగా ఉన్నత పాఠశాలగా విద్యా రంగాన విశేషమైన సేవలు అందిస్తూ మహోన్నతమైన ఆశయ సాధనలో ఆవిష్కృతమైన ఈ పాఠశాల అద్భుతమైన ఫలితాలతో వందేళ్లకు పైగా విద్యా రంగాన విశిష్ట సేవలు అందిస్తున్న 112 ఏళ్ల పైచిలుకు చరిత్ర గల పాఠశాలలో యడ్ల సత్యవతి ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేయటం తనకు అంది వచ్చిన అదృష్టంగా సత్యవతి పేర్కొన్నారు. వీరి పిల్లలు కూడా ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ ఉత్తమమైన బోధన అందించడమే గాక, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల రూపకల్పనలో ప్రధానోపాధ్యాయులు సత్యవతి నిరంతరం కృషి చేస్తున్నారు. రూ.12 లక్షలకు పైగా నిధులు వెచ్చించి స్టీలు బెంచీలు, మెష్‌లు, కంప్యూటర్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సంపూర్ణ సహకారంతో పాఠశాలకు అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తున్నారు. పాఠశాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు కొంపల్లి గంగాధర్, కార్యదర్శి పులిపాక రఘురాంల సూచనల మేరకు అభివృద్ధిలో పాఠశాలను అగ్రగామిగా నిలిపారు. ప్రధానోపాధ్యాయులు సత్యవతి చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం గతంలో జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డును ఆమెకు అందజేశారు. 2013లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారంతోపాటు, రాష్ట్రస్థాయిలో స్వచ్ఛంద సంస్థలు అవార్డులను సత్యవతి అందుకున్నారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఆమె 2025 ఉత్తమ జిల్లా ప్రధానోపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకొని, ఈ పాఠశాలలో తన పిల్లల్ని చదివించి, ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేయటం, ఇక్కడే ఉత్తమ అవార్డు తీసుకోవడం తనకు గర్వకారణంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఇదే విధమైన స్ఫూర్తితో తన ఉద్యోగ బాధ్యతలు ఉన్నంతకాలం పాఠశాలను అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా జిల్లా అవార్డును అందుకున్న ఆమె విద్యార్థుల్లో ఒక ఆదర్శవంతమైన స్ఫూర్తిని నింపారు. ఆమె భర్త పురం వెంకట సాంబశివరావు ఉపాధ్యాయుడే కావడం విశేషం.

యడ్ల సత్యవతి, హెచ్ఎం, ఏవీవీ హైస్కూల్, జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత

విజయాల విజిఆర్ఎం

ఇంటర్‌లో స్టేట్ ర్యాంకులతో విలసిల్లుతున్న కళాశాల

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో విజిఆర్ఎం కళాశాల స్థాపించిన మొదటి యేడాది నుండే జేఈఈ, నీట్ పరీక్షలకు ఇంటర్‌తో పాటు సమాంతర శిక్షణను బాపట్ల పట్టణానికి అందుబాటులోకి తెచ్చిన ఏకైక విద్యాసంస్థ వీజీఆర్ఎం కళాశాల డైరెక్టర్ గిరిధర కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజిఆర్ఎం విద్యాసంస్థల విజయాలను ఆయన వివరించారు. మొదటి ఏడాది నుంచి రాష్ట్రస్థాయిలో ర్యాంకులను సొంతం చేసుకుంటూ నాలుగో యేడాదిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన అరుదైన ఘనత విజిఆర్ఎం కళాశాలకు దక్కుతుందన్నారు. ఇంటర్మీడియట్ బోధన అనుభవం, అంకితభావం, అనుక్షణం కఠోరశ్రమతో విజయాలు నమోదు చేయగలిగాం. నాలుగేళ్లకే స్టేట్ ఫస్ట్ సాధించిన రికార్డు ఇప్పటికీ చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

జేఈఈ నీట్ వంటి పరీక్షలకు శిక్షణ

ఇంటర్ విద్యతో పాటు జేఈఈ, నీట్ వంటి పరీక్షలకు శిక్షణ కోసం గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లడం తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండేది కాదు. మగపిల్లల విషయంలో నిర్ణయం తీసుకుని, దూరప్రాంతాల్లో హాస్టళ్లకు పంపుతూ, ఆడపిల్లలను దూరం పంపలేక తల్లిదండ్రులు ఎంతో ఇబ్బంది పడేవాళ్ళు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని అపార అనుభవం గల ఉపాధ్యాయులే డైరెక్టర్లుగా 2013లో విజిఆర్ఎం కళాశాలను స్థాపించి బాపట్ల ప్రాంత ప్రజానీకానికి అందుబాటులో కళాశాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇంటర్ విద్యకు అయ్యే ఖర్చు తగ్గించి దిగువ మధ్య తరగతి, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ఫీజులతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయగలిగామన్నారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకునే విషయంలో ఎక్కడ రాజీ పడిందే లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను "అత్యుత్తమ ప్రతిభావంతులుగా" తీర్చిదిద్ది రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించగలిగామన్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ విద్యార్థిని ఆలపాటి నైమిషను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించిన సంఘటన మా కళాశాల చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా విద్యాబోధన చేపట్టి ఎంతో శ్రమతో ఉత్తమ ఫలితాల సాధనలో, ర్యాంకుల సాధనలో సఫలీకృతం అయ్యామన్నారు.. అనుభవజ్ఞులైన మా అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందన్నారు. గత విద్యా సంవత్సరంలో సీనియర్ ఇంటర్‌లో 988 మార్కులతో గాయత్రి స్టేట్ ర్యాంకును సాధించగా, జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 463 మార్కులతో సాత్విక్, బైపీసిలో 434 మార్కులతో ఉమాదేవి స్టేట్ ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. ఆద్యంతం అందుబాటులో ఉండే యాజమాన్యం నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులను క్రమశిక్షణ, రక్షణాత్మక చర్యలపరంగా ప్రత్యేక శ్రద్ధ వహించడం విజిఆర్ఎం కళాశాల ప్రత్యేకత అని గిరిధర కుమార్ వివరించారు.

అంబటి గిరిధర కుమార్, విజిఆర్ఎం డైరెక్టర్

విద్యతోనే సర్వం సాధ్యం

- బాలికా విద్యకు ప్రాధాన్యం
- శ్రీ పమిడి అంకమ్మ గురుకులం ప్రత్యేకం

ప్రజాశక్తి-బాపట్ల

'విద్యతోనే సర్వం సాధ్యం' అనే లక్ష్యంతో నాటి దాతల ఔదార్యంతో నెలకొల్పిన పాఠశాల నేడు ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడంలో బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలో శ్రీ పమిడి అంకమ్మ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల చదువులతో పాటు క్రీడలు, విద్యా విజ్ఞాన విభాగాల్లో అగ్రగామిగా నిలిచింది. నరసాయపాలెం గ్రామానికి చెందిన విద్యాదాత శ్రీ పమిడి అంకమ్మ 1962లో స్పెషల్ ఎయిడెడ్ పాఠశాలకు బీజం వేశారు. అంకుర దశ నుంచి మహావృక్షంగా ఎదిగిన ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎందరో ఐఏఎస్, ఐపీఎస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితర అత్యున్నత పదవులు అలంకరించడంతోపాటు విదేశాల్లో సయితం అనేక రంగాల్లో స్థిరపడి ఈ పాఠశాల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి అజయ్ కల్లం, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, కుంభా రవిబాబు, హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషి బాబుతో పాటు మరెందరో ఈ పాఠశాలలో చదివినవారు వైద్యులు, పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడిన వారందరూ ఈ పాఠశాల పేరును దశదిశలా వ్యాపింప చేశారు. ప్రధానంగా నరసాయపాలెం చుట్టుపక్కల గ్రామాల నుంచి అప్పట్లో కాలినడకన బాపట్లకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి. ఆరున్నర దశాబ్దాలకు పూర్వం ఈ ప్రాంతంలో అన్ని సామాజిక వర్గాలకు చదువు అవసరం అనే సంకల్పంతో శ్రీ పమిడి అంకమ్మ ఆ రోజుల్లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఇక్కడ ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటివరకు కో-ఎడ్యుకేషన్‌గా కొనసాగిన పాఠశాల తిరిగి 2018లో శ్రీ పమిడి అంకమ్మ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ప్రభుత్వ గురుకులాల్లో ఈ పాఠశాల విలీనమైంది. దీని అభివృద్ధికి విశ్రాంత స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కన్నెగంటి సంధ్యారాణి విశేష కృషి చేస్తున్నారు. కేవలం బాలిక విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఈ గురుకులం గ్రామీణ ప్రాంత బాలికా విద్యకు ఎంతగానో దోహదపడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మారుమూల గ్రామీణ ప్రాంతాల బాలికలు ఇక్కడ పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఎంతో ఉన్నత ఆశయాలతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో బాలికలు జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడలు, క్విజ్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అనేక పతకాలను ఈ పాఠశాలకు తెచ్చిపెట్టారు. ఈ పాఠశాలలో ప్రత్యేకంగా ఎన్‌సిసి విభాగాన్ని ఏర్పాటు చేశారు. బాలికా విద్యకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ఇక్కడ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపల్ పి వినీత తెలిపారు. శ్రీ పమిడి అంకమ్మ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అనేకమంది విద్యార్థినులు సైన్స్ ఫెయిర్‌లో జాతీయ స్థాయిలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. జిల్లా స్థాయిలో అనేక బహుమతులు పొందారు. క్రీడల్లో బాలికలను ప్రోత్సహించేందుకు ఇక్కడ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ఇక్కడ ఉపాధ్యాయులు, సెక్యూరిటీ సిబ్బంది సైతం మహిళలే విధులు నిర్వర్తిస్తారు. కార్పొరేట్ విద్యకు సమానంగా విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ వినీత ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గురుకులం భవనం

ప్రిన్సిపల్ పి వినీత

ఉపాధ్యాయులకు

ఆధునిక సవాళ్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సమాజం నిరంతరం మార్పులకు లోనవుతూ ఉంటుంది. సాంకేతికత, సాంస్కృతిక మార్పులు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక నిర్మాణాలు, విలువలు, జీవనశైలిలో వస్తున్న మార్పులు సమాజాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కూడా సాంప్రదాయక బోధనా పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధంచేసే దిశగా విస్తరిస్తోంది. మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర, ఆధునిక సవాళ్లు, బాధ్యతలు, విద్యా వ్యవస్థలో వారి స్థానం మరింత మారాల్సి ఉంది.

సాంప్రదాయ ఉపాధ్యాయుని పాత్ర

సాంప్రదాయంగా ఉపాధ్యాయుడు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే వ్యక్తిగా పరిగ ణించబడ్డాడు. ఒక నిర్దిష్ట పాఠ్యాంశాన్ని బోధిం చడం, విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని అందించడం పరీక్షల ద్వారా వారి పురోగతిని అంచనా వేయడం వంటి బాధ్యతలను నిర్వహిం చేవారు. ఈ పాత్ర ఎక్కువగా ఏకపక్షంగా ఉండే ది. ఉపాధ్యాయుడు జ్ఞానదాతగా, విద్యార్థి జ్ఞాన గ్రహీతగా ఉండేవారు. అయితే ఆధునిక సమాజంలో ఈ పాత్ర గణనీయంగా మారింది. సాంకేతికత, గ్లోబలైజేషన్, సామాజిక వైవిధ్యం, విద్యా సంస్కరణలు ఉపాధ్యాయుని పాత్రను మరింత సంక్లిష్టమైనదిగా బహుముఖమైనదిగా మార్చాయి.

సాంకేతికత యొక్క ప్రభావం

ఆధునిక సమాజంలో సాంకేతికత విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిం ది. ఇంటర్నెట్, డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ వంటి సాంకేతిక ఆవిష్కరణలు విద్యార్థులు జ్ఞానాన్ని గ్రహించే విధానాన్ని మార్చాయి. ఈ సందర్భంలో, ఉపాధ్యాయుడు కేవలం జ్ఞాన దాతగా కాకుండా, సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడంలో విద్యార్థు లకు మార్గదర్శిగా మారాలి. ఉదాహరణకు,... ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విద్యార్థు లు ఎక్కడి నుండైనా, ఎప్పుడైనా జ్ఞానాన్ని పొందవచ్చు. ఈ పరిస్థితిలో ఉపాధ్యాయుడు డిజిటల్ సాధనాలను ఉపయోగించి ఇంటరాక్టివ్ బోధనా పద్ధతులను అవలంబించాలి. ఫ్లిప్డ్ క్లాస్‌రూమ్, గేమిఫికేషన్, విద్యా యాప్‌లు వంటి ఆధునిక బోధనా సాధనాలను ఉపాధ్యాయులు నైపుణ్యంతో ఉపయోగించాలి. అదే సమయం లో, సాంకేతికత యొక్క దుర్వినియోగాన్ని నివారించడానికి విద్యార్థులకు డిజిటల్ సాక్షరతను నేర్పడం కూడా బాధ్యతగా మారింది.

సామాజిక వైవిధ్యం, సమ్మిళిత విద్య

మారుతున్న సమాజంలో సామాజిక వైవిధ్యం ఒక ముఖ్యమైన అంశంగా మారింది. విభిన్న సాంస్కృతిక, భాషా, మరియు ఆర్థిక నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులు ఒకే తరగతి గదిలో కలిసి చదువుతున్నారు. ఈ వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం ఉపాధ్యాయుని పాత్రలో కీలక భాగంగా మారింది. ఉపాధ్యాయుడు విద్యార్థుల మధ్య సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం, వారి సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తించడం, అందరికీ సమాన అవకాశాలను అందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించాలి. అదనంగా వికలాంగ విద్యార్థులను సమ్మిళిత విద్యా వ్యవస్థలో భాగం చేయడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ పొందాలి. ఇందుకోసం, వారు విభిన్న బోధనా పద్ధతులను అవలంబించాలి, తద్వారా ప్రతి విద్యార్థి తమ సామర్థ్యాలకు తగిన విద్యను పొందగలుగుతారు.

విద్యార్థులలో నైతిక విలువలు

మారుతున్న సమాజంలో నైతిక విలువలు మరియు నీతి బోధన ఉపాధ్యాయుని మరో ముఖ్యమైన బాధ్యతగా మారింది. సాంకేతికత మరియు గ్లోబలైజేషన్ వల్ల

విద్యార్థులు వివిధ సాంస్కృతిక మరియు నైతిక దృక్పథాలకు గురవుతున్నారు. ఈ సందర్భంలో, ఉపాధ్యాయు డు విద్యార్థులకు సత్యం, నీతి, బాధ్యత, మరియు సామాజిక న్యాయం వంటి విలువలను నేర్పడం ద్వారా వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలి.

ఉదాహరణకు... పర్యావరణ స్పృహ, లింగ సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఉపాధ్యాయుని బాధ్యతలో భాగం. ఇటువంటి విలువలను విద్యార్థులలో నాటడం ద్వారా, సమాజంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే సామర్థ్యం ఉపాధ్యాయులకు ఉంది.

వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి

ఆధునిక సమాజంలో విద్యార్థులు ఉద్యోగ మార్కెట్‌లో విజయవంతం కావడానికి విషయ పరిజ్ఞానంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా అవసరం. కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లెమ్ సాల్వింగ్, డిజిటల్ నైపుణ్యాలు వంటివి ఈ రోజు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు. ఉపాధ్యాయుడు విద్యార్థులలో ఈ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

ఉదాహరణకు.... ప్రాజెక్ట్–ఆధారిత బోధన, గ్రూప్ డిస్కషన్స్, రియల్–వరల్డ్ ప్రాబ్లెమ్ సాల్వింగ్ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులలో ఈ నైపుణ్యాలను పెంపొందించవచ్చు. అదనంగా కెరీర్ గైడెన్స్ మరియు కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు వారి భవిష్యత్తు లక్ష్యాలను సాధించడంలో సహాయం చేయవచ్చు.

ఉపాధ్యాయుని స్వీయ అభివృద్ధి

మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుడు తన స్వీయ అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలి. కొత్త సాంకేతికతలు, బోధనా పద్ధతులు, విద్యా సంస్కరణల గురించి నిరంతరం నేర్చుకోవడం ద్వారా ఉపాధ్యాయుడు తనను తాను ఆధునీక రించుకోవాలి. శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్ లు, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు.

మానసిక, భావోద్వేగ సహాయం

ఆధునిక సమాజంలో విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయు డు విద్యార్థులకు మానసిక. భావోద్వేగ సహాయం అందించడంలో కూడా పాత్ర పోషించాలి. విద్యార్థులతో సానుభూతితో కూడిన సంబంధాన్ని నిర్మించడం, వారి సమస్యలను వినడం, సానుకూల దృక్పథాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు.

సమాజంలో సానుకూల మార్పులకు దోహదం

ఉపాధ్యాయుడు సమాజంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే శక్తిగా పనిచేస్తాడు. విద్య ద్వారా ఉపాధ్యాయులు సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించడానికి, విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించడానికి, సమాజాన్ని మరింత సమానమైన, న్యాయమైన స్థలంగా మార్చడానికి దోహదపడతారు.

ముగింపు

మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కేవలం జ్ఞాన బోధనకు పరిమితం కాదు. ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుడు మార్గదర్శి, సాంకేతిక నిపుణుడు, నైతిక విలువల బోధకుడు, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి సహాయకుడు, మరియు మానసిక సహాయకు డిగా బహుముఖ పాత్రలను పోషిస్తాడు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా, ఉపాధ్యాయుడు విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడమే కాకుండా, సమాజంలో సానుకూల మార్పులను తీసుకొచ్చే శక్తిగా నిలుస్తాడు.

స్టార్ రేటింగ్ పొందేలా పాఠశాలలు బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయులు రానున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి సిలబస్ పూర్తి చేయాలని నిర్ధేశించారు. 9వ తరగతి విద్యార్థులకు మార్చి లోనే సిలబస్ పూర్తి చేసి అప్పటి నుంచి 10వ తరగతి సిలబస్ చెప్పడం జరుగుతుంది.

గత విద్యావిధానం అమలులో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పలు యాప్‌ల కారణంగా ఇబ్బందులు పడిన నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఒక్కటే లీప్ యాప్ తేవడం జరిగింది. జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న 1,315 పాఠశాలలు అన్నిటికి విద్యామిత్ర పథకం కింద కిట్లు పంపిణీ చేయడం జరిగింది. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో అర్హులైన వారందరికి నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో పడ్డాయి. విశాఖపట్టణంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా నుంచి వెయ్యి మంది విద్యార్థులు, వెయ్యి మంది ఉపాధ్యాయులు వెళ్ళడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా జిల్లాలో ఫేజ్ 1 క్రింద జిల్లా లో 272 పాఠశాల భవనాల అభివృద్ధి పనులు చేపట్టారు. నాడు నేడు ఫేజ్-2 లో జిల్లాలో 436 పాఠశాల భవనాలను అభివృద్ధి చేపట్టడం జరిగింది. విద్యార్థులలో సైన్స్ పరిజ్ఞానాన్ని మరింత పెంచే చర్యల్లో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో పాఠశాల స్థాయి, మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లు, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్ అండ్ క్లీన్లీనెస్, సాఫ్ట్ వేర్ యాప్స్, క్లైమేట్ అండ్ ఎన్విరాన్మెంట్ చేంజెస్, మ్యాథమెటిక్స్ మోడలింగ్ అంశాల ఆధారంగా విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు తగిన కసరత్తు జరుగుతుంది. విద్యా హక్కు చట్టం ద్వారా జిల్లా లోని ప్రైవేటు, ఆన్ ఎయిడెడ్ స్కూళ్ళలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన పేద విద్యార్దులకు 25 శాతం సీట్లను కేటాయింపుల కోసం తగిన చర్యలు తీసుకోవడం జరిగింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం జరుగుతుందని డిఇఒ తెలిపారు.